మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 87 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad

శనివారం 22 జూన్ 2024

## బొగ్గు వేలం అడ్డుకోవాలి - జగదీశ్ రెడ్డి



హైదరాబాద్ (ప్రజా మంటలు): సింగరేణి బొగ్గు గనులను వేలం వేయడం అనేది.. సింగరేణికి ఉరి వేయడమే అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో జగదీశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రయోజనాల పట్ల కాంగ్రెస్, బీజేపీ నేతలకు సోయి లేదు. ప్రాజెక్టుల విషయంలో కేంద్రం కుట్రలను ఖండించాం. కేసీఆర్ కదిలిన తర్వాతే కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు మిగతా 2లో..

# ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ

- రైతుభరోసాకు విధివిధానాలు - ఇచ్చిన హామీ మేరకు అందజేత - రుణమాఫీ అమలుపై మంత్రివర్గ ఉపసంఘం - కేబినేట్ భేటీలో కీలక నిర్ణయం
- ఐదేళ్ల కాలంలో తీసుకున్న రుణాలకు వర్తింపు - 2018 డిసెంబరు 11 కటాఫ్ తేదీగా నిర్ణయం
- 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు పరిగణన - మీడియాకు వివరాలు వెల్లడించిన సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్,జూన్21 (ప్రజా మంటలు): తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు 2లక్షల వరకు రుణమాఫీ చేయాలని నిర్ణయించింది. ఏకమొత్తంలో రణమాఫీ చేయడంతో పాటు, విధివిధానాలను రూపొందించనుంది. ఈ క్రమంలో రుణాల మాఫీకి మంత్రివర్గం ఆమోదం ఇచ్చింది. రుణమాఫీకి కటాఫ్ నిర్ణయించింది. డిసెంబర్ 9వ తేదీని రుణమాఫీ కటాఫ్ తేదీగా ఏకగ్రీవ తీర్మానం చేసింది రాష్ట్ర కేబినెట్. అంతేకాదు.. రుణాలన్నింటినీ ఏకకాలంలో మాఫీ చేయాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 9, 2023 ముందు నాటికి తీసుకున్న రుణాలన్నింటినీ ఒకే విడతలో మాఫీ చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలోని 47 లక్షలకు పైగా మంది రైతులకు ఊరట లభించనుంది. న్నికల హామీలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి రైతుల రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో రుణామాఫీలు చేస్తామని హామీ ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం. అయితే, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఉండటం కారణంగా ఆలస్యమైంది. ఇప్పుడు ఎన్నికల కోడ్ లేకపోవడంతో రుణాల మాఫీపై స్పీడ్ పెంచింది సర్కార్. ప్రధానంగా ఆగస్ట్ 15 లోపు రైతు రుణాలు మాఫీ చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ఆ ప్రకటన మేరకు.. ప్రభుత్వం స్పీడ్ పెంచింది. రైతు రుణాల మాఫీ ప్రధానంశంగా రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం నాడు భేటీ అయ్యింది. ఈ భేటీలో రైతు రుణమాఫీ ఎలా చెయ్యాలి. దశల వారీగా చేయాలా? ఒకేసారి చేయాలా? అర్హులు ఎవరు? ఎవరి రుణాలు మాఫీ చేయాలి? అంశాలపై కూలంకశంగా చర్చించారు. అనంతరం.. రైతు రుణమాఫీని ఏకకాలంలో చేయాలని తీర్మానం చేశారు. అది కూడా ఆగస్ట్ 15 లోపు ఈ పక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు. రుణమాఫీపై తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 9 2023లోపు తీసుకున్న రుణాలన్నీ మాఫీ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. రైతు రుణమాఫీ, రైతు భరోసా, పంటల బీమా, మద్దతు ధరపై ఈ కేబినెట్ సమావేశంలో ప్రధానంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంది. ఇందుకు అవసరమైన నిధుల సమీకరణతో పాటు విధివిధానాలను కూడా చర్చించి ఒక నిర్ణయం తీసుకోనున్నారు. అయితే.. ఈ పథకాలకు ఎవరెవరు అర్హులు అన్న దానిపై నిర్ణయం కూడా తీసుకోనున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ ట్యాక్స్ చెల్లింపు దారులు రైతు రుణమాఫీ వర్తించే అవకాశం లేదు. ఇప్పటికే అధికారులు మహారాష్ట్ర, రాజస్థాన్ వెళ్లి అక్కడ అధ్యయనం చేసి నివేదిక సమర్పించారు అధికారులు. ఈ కేబినెట్ మొత్తం రైతులకు సంబంధించిన ప్రయోజనాలపైనే ఎక్కువగా చర్చించారు. కేబినెట్ భేటీ అనంతరం మంత్రులతో కలిసి సిఎం రేవంత్ రెడ్డి వివరాలను మీడియాకు వెల్లడించారు. వ్యవసాయాన్ని పండుగ చేయడమే కాంగ్రెస్ విధానమని, రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ.. ఏదైనా మాట చెబితే అది శిలా శాసనం. ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కొని నిలబడి.. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం మా నాయకుల గొప్పతనం.. కమిట్ మెంట్. 2022 మే 6 వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ రుణమాఫీ హామీ ఇచ్చారు. రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేయాలని కేబినెట్ నిర్ణయించిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత గత ప్రభుత్వం 2014, 2018లో రుణమాఫీ చేసింది. మొదటిసారి రూ.16వేల కోట్లు, రెండో సారి రూ.12వేల కోట్లు రుణమాఫీ చేసింది. అప్పటి ప్రభుత్వం 2018 డిసెంబరు 11 కటాఫ్ తేదీగా నిర్ణయించింది. మా ప్రభుత్వం 2018 డిసెంబరు 12 నుంచి మొదలు పెట్టి.. 2023 డిసెంబరు 9 వరకు కటాఫ్ తేదీగా పరిగణనలోకి తీసుకుంది. ఐదేళ్ల మధ్య కాలంలో ఈ రాష్ట్రంలో ఉన్న రైతులు తీసుకున్న రుణాలు రూ.2లక్షల వరకు మాఫీ చేయాలని కేబినెట్ నిర్ణయించింది. రుణమాఫీతో 47 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరనుందని తెలిపారు. రుణమాఫీ విధివిధానలను జివోలో తెలియచేస్తామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతు భరోసా అమలుపై మంత్రివర్గ ఉపసంఘం వేశామని అన్నారు. డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో కమిటీ విధివిధానాలు ఖరారు మిగతా 2లో..

## నీట్‌పై ఆగని ఆందోళనలు




న్యూఢిల్లీ,జూన్21 (ప్రజా మంటలు): నీట్‌పై దేశవ్యాప్తంగ ఆందోళనలు మిన్నంటాయి. ఎక్కడికక్కడ విద్యార్థులు రోడ్లపైకి వచ్చి నిరసన ప్రదర్శనలు చేపడుతున్నారు. కాగా దేశంలో వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు జరిగిన 'నీట్-యూజీ ప్రవేశ పరీక్ష 2024'లో తీవ్ర నిర్వహణ లోపాలు ఉన్నట్లు ఎన్‌టీఏ థర్డ్‌పార్టీ రివ్యూలో గుర్తించారు. ఈ పరీక్ష దేశవ్యాప్తంగా సుమారు 4,000 కేంద్రాల్లో జరిగింది. వీటిల్లో 399 సెంటర్లను థర్డ్‌పార్టీ స్వయంగా పరిశీలించింది. కొన్నిచోట్ల పరీక్ష జరుగుతున్న గదుల్లో సీసీ కెమెరాలు లేవని.. ఉన్నా కొన్నిచోట్ల పనిచేయడం లేదని గుర్తించారు. ఎన్‌టీఏ నిబంధనల ప్రకారం పరీక్ష గదిలో కచ్చితంగా రెండు కెమెరాలు ఉండాల్సిందే. దీంతోపాటు ఆయా సెంటర్లలో ప్రశ్నపత్రాలను భద్రపర్చిన చోట గార్డుల రక్షణ లేని మిగతా 2లో..

## ప్రపంచ వ్యాప్తంగా యోగా డే ఉత్సవాలు



2లో..


## ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత దక్కని ఊరట

- జూలై 9 వరకు కస్టడీ పొడిగింపు



న్యూఢిల్లీ,జూన్21 (ప్రజా మంటలు): ఢిల్లీ లిక్కర్ కేసులో కవితకు ఊరట దక్కడం లేదు. ఆమె బెయిల్‌ను కోర్టు తిరస్కరించడమే గాకుండా జులై9 వరకు కస్టడీని పొడిగించింది. ఇక ఢిల్లీ సిఎం కేజ్రీవాల్‌కు రౌస్ అవెన్యూ కోర్టు బెయిల్ మంజూరు చేసినా, ఇడి వాల్ చేయడంతో వ్యవహారం హైకోర్టుకు చేరింది. కిందికోర్టు ఇచ్చిన బెయిల్‌పై హైకోర్టు స్టే విధించింది. దీంతో ఇద్దరికీ బెయిల్ కష్టాలు ప్పడం లేదు. ఈ క్రమంలో సీబీఐ ప్రత్యేక కోర్టులో బీఆర్ఎస్ ఎంఎల్‌సి కవితకు ఎదురుదెబ్బ తగిలింది. లిక్కర్ పాలసీ పై సీబీఐ దాఖలు చేసిన కేసులో కవితకు జ్యుడిషియల్ కస్టడీ పొడిగించారు. కవిత జ్యుడిషియల్ కస్టడీ ముగియడంతో ఆమెను వర్చువల్‌గా కోర్టు ముందు అధికారులు హాజరుపరిచారు. జులై 7వరకు కస్టడీ పొడిగిస్తూ సిబిఐ ప్రత్యేక కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మార్చి 15వ తేదీన హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్ట్ చేసింది. అనంతరం ఆమె జ్యుడిషియల్ కస్టడీలోభాగంగా న్యూఢిల్లీలోని తీహార్ జైల్లో ఉన్నారు. బెయిల్ కోసం న్యాయస్థానాల్లో పోరాటం చేస్తున్నారు. ఆ తర్వాత ఇదే కేసులో ఆమెను సీబీఐ సైతం విచారించి అరెస్టు చూపించింది. మరోవైపు ఇదే కేసులో అరెస్టయిన ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు రౌస్ అవెన్యూ కోర్టు సాధారణ మిగతా 2లో..

## ప్రజా నాడి




# బిఆర్ఎస్‌కు భారీ షాక్

- కాంగ్రెస్ ఆకర్ష్‌కు పోచారం అట్రాక్షన్
- కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ నేత పోచారం
- పోచారం ఇంటికి వెళ్లి పార్టీలోకి ఆహ్వానించిన సిఎం రేవంత్
- తండ్రీకొడుకులకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానం
- తెలంగాణ అభివృద్ధి కోసమే పార్టీ మారుతున్నట్లు ప్రకటన
- రైతు సంఓేమం కోసమే అని ప్రకటించిన శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్,జూన్21 (ప్రజా మంటలు): భారాసకు భారీ షాక్ తగిలింది. తెలంగాణ మాజీ స్పీకర్, భారాస బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పోచారంతో పాటు ఆయన కుమారుడూ కాంగ్రెస్‌లో చేరారు. ఎన్నికల సందడి సద్దు మణగడంతో కాంగ్రెస్ ఆకర్ష్‌కు పదను పెట్టింది. చాపకింది నీరులా వ్యవహారం చక్కబడింది. అనూహ్యంగా పోచారం శ్రీనివాసరెడ్డి స్వయంగా సిఎం రేవంత్‌ను తన ఇంటికి ఆహ్వానించారు. దీంతో సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపి బలరామ్ నాయక్ తదితరులు నేగా పోచారం ఇంటికి వెళ్లారు. కాసేపట్లోనే ఈ ప్రకటన వచ్చింది. అనంతరం రేవంత్, పోచారం మీడియాతో మాట్లాడారు. రైతుల సంక్షేమానికి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నో సేవలందించారని రేవంత్‌రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని.. ఈ విషయంలో పోచారం సూచనలు స్వీకరిస్తామని చెప్పారు. వ్యవసాయం దండగ కాదని.. పండగ చేసే బాధ్యత తమదని చెప్పారు. రైతు సంక్షేమ రాజ్యం కోసం సహకరించే అందరి మద్దతు తీసుకుని ముందుకెళ్తామన్నారు. పోచారం లాంటి వారి సలహాలు తీసుకుని ముందుకు వెళతామని అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా పోచారం శ్రీనివాస్ రెడ్డిని కలిసి పార్టీలోకి ఆహ్వానించామన్నారు. అండగా పెద్దలు నిలబడాలని కోరినట్టు వెల్లడించారు. తెలంగాణ రైతుల సంక్షేమం కోసం పోచారం కాంగ్రెస్‌లో చేరారని తెలిపారు. 'రైతుల సంక్షేమంపై వారి సలహాలు సూచనలు తీసుకుని ముందుకెళతాం. రైతు రుణమాఫీ విధివిధానాలపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోబోతున్నాం. భవిష్యత్‌లో పోచారం శ్రీనివాస్ రెడ్డికి సముచిత గౌరవం ఇస్తాం. నిజామాబాద్ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ఆయన సహకారం తీసుకుంటాం. ఇది రైతు రాజ్యం.. రైతు సంక్షేమ రాజ్యం.. రైతు సంక్షేమం కోసం అవసరమైన అందరినీ కలుపుకుని పోతాం.' అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఉదయం పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంటికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలిసి వెళ్లి పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. ఇప్పటికే ప్రాథమిక చర్చలు పూర్తి అయిన వేళ ఇవాళ మర్యాదపూర్వకంగా కలిసి పార్టీలో చేరాలని పిలుపునిచ్చారు. సుమారు రెండు గంటల చర్చల అనంతరం పార్టీలో చేరుతున్నట్టు

మొదటి పేజీ తరువాయి

# బీఆర్ఎస్‌కు భారీ షాక్



మాజీ స్పీకర్ పోచారం మీడియాకు తెలిపారు. రైతు బిడ్డను కాబట్టి.. వ్యవసాయంతో ఉన్నటువంటి అనుబంధం తెలుసు కాబట్టి వారు తీసుకుంటున్న నిర్ణయాలకు అండగా ఉండాలని, రైతులు బాగుపడాలని, వారి కష్టాలు తీరాలని ఉద్దేశంతో రేవంత్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరాను. కొన్ని సమస్యలు వస్తాయి.. వాటిని అధిగమిస్తూ ముందుకు వెళ్తున్నారు. వారి కేబినెట్‌ను అభినందిస్తున్నాను. నా జీవితంలో రాజకీయంగా ఆశించేది ఏం లేదు. రైతులతో పాటు వ్యవసాయం బాగుండాలి. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రగతిలో చేదోడు వాదోడుగా ఉండాలని నిర్ణయించుకున్నాను అని పోచారం తెలిపారు. టీఆర్ఎస్ కంటే ముందు టీడీపీలో ఉన్నాను. ఆనాడు ఉన్న పరిస్థితులను బట్టి టీఆర్ఎస్‌లో చేరాను. కాంగ్రెస్ పార్టీతోనే నా రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. మళ్లీ చివరగా రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరాను. రేవంత్ కార్యక్రమాలు నచ్చి వారి నాయకత్వాన్ని బలపరచాలని కాంగ్రెస పార్టీలో చేరాను. రైతుల సంక్షేమాన్ని మాత్రమే నేను కోరుకుంటున్నాను. రేవంత్‌ను భగవంతుడు ఆశీర్వదించాలని ప్రార్థిస్తున్నానని పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక జరుగుతున్న పరిణామాలను గమనిస్తు న్నానని.. సీఎం రేవంత్‌ను మనస్ఫూర్తిగా ఇంటికి ఆహ్వానించానని పోచారం తెలిపారు. రైతు సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టుల ప్రగతికి తీసుకున్న నిర్ణయాలు ఆమోదయోగ్యంగా ఉన్నాయన్నారు. తాను రైతుబిడ్డనని.. అందుకే ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు అండగా ఉండాలనే రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరినట్లు వివరించారు. సమస్యలను అధిగమిస్తూ సీఎం రేవంత్ ధైర్యంగా ముందుకెళ్తున్నారు. నా జీవితంలో ఆశించేది రైతు సంక్షేమం తప్ప ఇంకేమీ లేదు. గతంలో వ్యవసాయ మంత్రిగా పనిచేశాను. అందరి సహకారంతో రాష్ట్ర భవిష్యత్ కోసం పనిచేస్తాం. నా రాజకీయ జీవితం ప్రారంభమైందే కాంగ్రెస్‌తో. ఆ తర్వాత తెదేపా, భారాసలో పనిచేశాను. రేవంత్ చేపడుతున్న కార్యక్రమాలకు అండగా ఉండాలనే కాంగ్రెస్‌లో చేరాను. తను ఇప్పుడు పదవులకోసం పాకులాడే అవసరం లేదన్నారు. 20 ఏళ్లు రాష్ట్రానికి నాయకత్వం వహించే ఓపిక ఆయనకు ఉంది. మాకు వయసైపోయింది.. పనిచేసే నాయకుడిని ప్రోత్సహించాలని పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో ఇటివల పార్లమెంట్ ఎన్నికల్లో విఫలమైన బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి ప్రస్తుతం



దారుణంగా తయారైంది. పార్టీలోని కీలక నేతలు క్రమంగా పార్టీని వీడుతున్నారు. ఈ నేపథ్యంలోనే తెలంగాణ మాజీ శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ క్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లగా, శ్రీనివాస్ రెడ్డితో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భేటీ అయ్యారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి బాన్సువాడ నియోజకవర్గం నుంచి 2009 నుంచి 2023 వరకు వరసగా ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎంపిక కావడం విశేషం. ఆ క్రమంలోనే పోచారం తెలంగాణ ప్రభుత్వంలో 2014-2019 వరకు వ్యవసాయ మంత్రిగా, 2019 జనవరి 17 నుంచి 2023 డిసెంబర్ 6 వరకు తెలంగాణ శాసనసభ స్పీకర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ నుంచి కీలక నేతలైన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎంపీ రంజిత్ రెడ్డి, కేకే, కడియ శ్రీహరి, కడియం కావ్యాలు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. అంతేకాదు మరికొన్ని రోజుల్లో ఇంకొంత మంది నేతలు కూడా కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. నేపథ్యంలోనే పోచారంతో సీఎం భేటీపై ఎమ్మెల్యే దానం నాగేందర్ రెడ్డి స్పందించారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేరనున్నట్లు తెలిపారు. దీంతో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుందని స్పష్టం చేశారు. కేసీఆర్ విధానాలే బీఆర్ఎస్ పార్టీని ముంచాయని వ్యాఖ్యానించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డే కాదు, చాలామంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని దానం అన్నారు. ఈ క్రమంలో గ్రేటర్ హైదరాబాద్లో బీఆర్ఎస్ మొత్తం ఖాళీ అవుతుందన్నారు. ఇక చేరనున్న వారిలో కాలే యాదయ్య, అరికపూడి గాంధీ, గూడెం మహిపాల్ యాదవ్, ముఠా గోపాల్, సుధీర్ రెడ్డి, కుత్బుల్లా పూర్ ఎమ్మెల్యే వివేకానంద్, కొత్త ప్రభాకర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్ ఉన్నారని చెప్పారు. దీంతోపాటు మల్లారెడ్డి కూడా కాంగ్రెస్ లో చేరడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. చేరికలపై రెండు మూడు రోజులుగా సీఎం నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి, సునీల్ కనుగోలు చర్చించారని అన్నారు. మరోవైపు హరీష్ రావుతో కలిసి పలువురు బీజేపీకి వెళ్లేందుకు ట్రై చేస్తున్నట్లు తెలిపారు. ఈ విధంగా బీఆర్ఎస్ పార్టీ నుంచి అందరు నేతలు వెళ్లి పోతే ఇక చివరికి మిగిలేది కేసీఆర్, ఆయన కొడుకు కేటీఆర్, కుమార్తె కవిత, మేనల్లుడు హరీశ్ రావు మాత్రమే మిగిలే విధంగా అనిపిస్తుంది.

## ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ

చేస్తుందని అన్నారు. జులై 15లోపు ఉప సంఘం నివేదిక ఇస్తుంది. ఆ నివేదిక ఆధారంగా రైతు భరోసా విధివిధానాలు ఖరారు చేస్తాం. రుణమాఫీ కోసం రూ.31వేల కోట్లు అవసరమని అంచనా వేశాం. రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వ నిర్ణయాలను ఇకపై మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందిస్తారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మీడియా సమావేశంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, జూపల్లి, కోమటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే రైతు రుణాలను ఒకే దఫాలో మాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నారు. అయితే, ఎలాంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని కోరుతున్నారు.

## ఢిల్లీ లిక్కర్ కేసులో కవిత దక్కని ఊరట

### - జూలై 9 వరకు కస్టడీ పొడిగింపు

బెయిల్ మంజూరు చేసింది కానీ.. ఢిల్లీ హైకోర్టు స్టే ఇచ్చింది. కవిత బెయిల్ కోసం ఆమె తరపు న్యాయవాదులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. కనీసం మధ్యంతర బెయిల్ కూడా దక్కలేదు. బీఆర్ఎస్ పార్టీ న్యాయ విభాగం కూడా శ్రమిస్తోంది. ఇటీవల కవిత కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసినప్పటికీ.. ఆమెకు బెయిల్ లభించలేదు. తనను అక్రమంగా అరెస్టు చేశారని.. ఇది మనీలాండరింగ్ కేసు కాదని, పొలిటికల్ లాండరింగ్ కేసని అప్పట్లో కవిత చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి. ఇప్పుడు ఆమె కస్టడీని కూడా కోర్టు పొడిగిస్తూ వస్తోంది. ఈ కేసులో కవితే ప్రధాన నిందితురాలని, ఆమెకు బెయిల్ వస్తే సాక్ష్యులను ప్రభావితం చేసే అవకాశం ఉందని ఈడీ వాదిస్తూ వస్తోంది. కాగా.. ఈమేరకు ఛార్జిషీట్ కూడా దాఖలు చేసింది. కాగా.. ఈ కేసులో 100 కోట్ల ముడుపులు చేతులు మారాయని.. అందులో కీలక సూత్రధారి, పాత్రధారి కవితేనంటూ ఈడీ, సీబీఐ అధికారులు స్పష్టం చేస్తున్నారు. చార్జిషీట్లలోనూ ఇదే విషయం చెప్పారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టు అయిన వారు సుదీర్ఘ కాలంగా జైల్లో ఉంటున్నారు. ఢిల్లీ డిప్యూటీ సీఎం మనష్ సిసోడియా అరెస్ట్ అయి ఏడాది దాటిపోయింది. కేజీవ్రాల్‌కు బెయిల్ లభించడం లేదు. ఆయన సీఎం పదవికి కూడా రాజీనామా చేయడం లేదు. అప్రూవర్లుగా మారిన ఇతర నిందితులు మాత్రం బెయిల్ తెచ్చుకున్నారు. ఇకపోతే ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ముఖ్యమంత్రి కేజీవ్రాల్‌కు గురువారం ఢిల్లీ కోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. మరికొన్ని గంటల్లో తీహార్ జైలు నుంచి విడుదలవుతారన్న సమయంలో హైకోర్టు రూపంలో మరో షాక్ తగిలింది. ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై ఈడీ హైకోర్టును ఆశ్రయించింది. అత్యవసరంగా విచారించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ న్యాయస్థానాన్ని అభ్యర్థించింది. దీంతో ఢిల్లీ కోర్టు తీర్పుపై హైకోర్టు స్టే విధించింది. ఈ పరిణామంతో ఆప్ షాక్‌కు గురైంది. ఇక తీర్పును రిజర్వ్ చేసే వరకు కేజీవ్రాల్‌ను జైలు నుంచి బయటకు వచ్చేందుకు అనుమతించాలని కేజీవ్రాల్ తరపున హైకోర్టును కోరారు. కానీ కేజీవ్రాల్ అభ్యర్థనను ధర్మాసనం తిరస్కరించింది. మొత్తం రికార్డులను పరిశీలించాలని కోరుతున్నందున 2-3 రోజుల పాటు ఉత్తర్వులను రిజర్వ్ చేస్తున్నట్లు కోర్టు తెలిపింది. దీంతో తుదితీర్పు వచ్చే వరకు కేజీవ్రాల్ తీహార్ జైల్లోనే ఉండనున్నారు. ఇదిలా ఉంటే ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును ఛాలెంజ్ చేసిన ఈడీ.. మద్యం పాలసీ కేసులో కేజీవ్రాల్‌కు వ్యతిరేకంగా ఆధారాలున్నాయని వాదించింది. అయితే ఇరు పక్షాల వాదనలు విన్న ఢిల్లీ హైకోర్టు తీర్పును రిజర్వ్‌లో ఉంచింది. లిక్కర్ పాలసీ కేసులో మార్చి 21న కేజీవ్రాల్‌ను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం తీహార్ జైలుకు తరలించారు. అయితే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సుప్రీంకోర్టు.. 21 రోజులు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనంతరం జూన్ 2న తిరిగి తీహార్ జైల్లో లొంగిపోయారు. మొత్తానికి ఇంత కాలానికి గురువారం ఢిల్లీ కోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేస్తే.. కొన్ని గంటల వ్యవధిలోనే హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది.

## బొగ్గు వేలం అడ్డుకోవాలి - జగదీశ్ రెడ్డి

అప్పగించబోమని అసెంబ్లీలో తీర్మానం చేశారు. గోదావరి జలాల తరలింపుపై గతంలో కేసీఆర్ గళమెత్తారు. ఇప్పుడు గోదావరి నీళ్లు దోచుకుపోతుంటే రేవంత్ రెడ్డి స్పందించలేదు. సింగరేణిని ప్రయివేటీకరణ కుట్రకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయి. ఇప్పుడు సింగరేణిని కాపాడుకోవడం మనందరి బాధ్యత. రాష్ట్రానికి కేసీఆరే శ్రీరామరక్ష అని మళ్లీ నిరూపితమవు తోంది. బొగ్గు గనుల అంశంలో ప్రశ్నిస్తే ఎదురుదాడి చేస్తున్నారు. బొగ్గు గనుల వేలం వద్దని గతంలో రేవంత్ రెడ్డి ఇదే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఇవాళ మాత్రం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వేలంలో పాల్గొన్నారు అని మండిపడ్డారు. కిషన్ రెడ్డి పదవి తీసుకొని హైదరాబాద్‌లో దిగిన మొదటి రోజే తెలంగాణ రాష్ట్ర ప్రజలకి ద్రోహం చేసే పని చేశాడని జగదీశ్ రెడ్డి ధ్వజమెత్తారు. కొంత మందికి పదవులు వస్తే అదృష్టం వచ్చింది అనుకుంటాం కానీ కిషన్ రెడ్డి దురదృష్టవంతుడు. కిషన్ రెడ్డికి ఎన్ని పదువులు వచ్చినా ఈ రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే పని ఒక్కటి కూడా చెయ్యలేదు.. గత ఐదేండ్లలో కిషన్ రెడ్డి చేసింది ఏమైన ఉందంటే అక్కడ ఎక్కడో రైల్వే స్టేషన్లో పాత లిఫ్టును బాగు చేసి ప్రారంభించడం. ఈసారి క్యాబినెట్ పదవి తీసుకొని హైదరాబాద్ వచ్చిన మొదటి రోజే మన తెలంగాణను ద్రోహం చేసే పని, మన సింగరేణిని నట్టేట ముంచి దానికి ఉరి పెట్టే పని చేశాడు అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సింగరేణికి కొత్త గనులు కేటాయించాలి

**- త్వరలోనే అఖిలపక్షంతో ప్రధానిని కలుస్తా:భట్టి - సంస్థకు నష్టం రాకుండా చూస్తా**

**- తెలంగాణ బిడ్డగా అది నా బాధ్యత - కేంద్ర గనులశాఖ మంత్రి కిషన్ రెడ్డి**




హైదరాబాద్ (ప్రజా మంటలు): సింగరేణి సంస్థకు నష్టం వాటిల్లకుండా చూస్తానని, తెలంగాణ బిడ్డగా అది తన బాధ్యత అని కేంద్ర గనులశాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ లో బొగ్గుగనుల వేలాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పిన అంశాలను పరిశీలిస్తామని, సింగరేణి ఉద్యోగులు, కార్మికులకు నష్టం రాకుండా చూస్తానని అన్నారు. ఆదాయం కోసమే బొగ్గుగనుల వేలం వేయడం లేదని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను దృష్టిలో పెట్టుకొని చేపట్టామని కిషన్ రెడ్డి చెప్పారు. ఒడిశాలోని నైని బ్లాక్‌లో సింగరేణికి లాభం వచ్చే విధంగా ప్రొడక్షన్ స్టార్ట్ చేస్తామని అన్నారు. దీనిపై త్వరలోనే ఒడిస్సా, తెలంగాణ ప్రభుత్వాలతో మాట్లాడతామని కిషన్ రెడ్డి తెలిపారు. సింగరేణి కాలరీస్ లో కేంద్ర ప్రభుత్వానికి 49శాతం వాటా ఉందని చెప్పారు. సింగరేణిని కాపాడుకునే బాధ్యత కేంద్రంపైనా ఉందని చెప్పారు. గత ప్రభుత్వ విధానాల వల్ల సింగరేణి నష్టాల్లోకి వెళ్లిందని అన్నారు. కమర్షియల్ మైన్ యాక్షన్ పారదర్శకంగా జరుగుతుందని, బిడ్డర్స్ కు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. పదేండ్ల క్రితం పరిశ్రమలకు పవర్ హాలీడే ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేదని, కొత్త పాలసీ వల్ల నిరంతరం విద్యుత్ సరఫరా అవుతోందని చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అవకాశం ఇస్తే అఖిల పక్షంగా వచ్చి ప్రధానిని కలుస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 10వ బొగ్గు వేలం పక్రియను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించారు. సింగరేణికి భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని రిజర్వేషన్ ప్రకారం సింగరేణి కి బొగ్గు బ్లాకులు కేటాయించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున మల్లు భట్టి విక్రమార్క వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ నుంచి కాకుండా మొట్టమొదటి సారి కమర్షియల్ బొగ్గు గనుల వేలం పక్రియ హైదరాబాద్ లో నిర్వహిస్తున్నారని తెలిపారు. కిషన్ రెడ్డికి తెలంగాణ పరిస్థితులు బాగా తెలుసన్నారు. సింగరేణి సంస్థ తెలంగాణకి ఆయువు పట్టు, కొంగుబంగారం అన్నారు. సింగరేణి బొగ్గు వల్లే మన రాష్ట్రంలో థర్మల్ ప్లాంట్స్ నడుస్తున్నాయన్నారు. 130 ఏళ్ల అనుభవం ఉన్న సింగరేణి సంస్థకు కొత్త బ్లాక్ లు కేటాయించాల్సిన అవసరం ఉందని తెలిపారు. త్రైపాక్షిక ఒప్పందాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని తెలిపారు. 1400 వందల మిలియన్ టన్నులు బొగ్గును తియ్యడానికి అవకాశం ఇంకా ఉందని తెలిపారు. 2015లో కొత్త చట్టం వల్ల సింగరేణి తనకు ఉన్న అర్హతలను కోల్పోయిందని తెలిపారు. సత్తుపల్లి, కోయగూడ, మరో రెండు బ్లాక్ లను సింగరేణికి కేటాయించాలని కేంద్రం వద్ద ప్రతిపాదన ఉందన్నారు. సింగరేణి ప్రభుత్వ సంస్థ, ?కేంద్రం సింగరేణికి సహకారం ఇవ్వకపోవడం బాధాకరం అన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల గతంలో ప్రైవేట్ సంస్థల చేతుల్లోకి కోల్ బ్లాక్ కు వెళ్లాయన్నారు. రిజర్వేషన్లు పక్కన పెట్టి ప్రైవేటీకరణ దిశగా వేలం పాట నడవడం వల్ల సింగరేణికి నష్టం వాటిల్లిందన్నారు. 2039 నాటికి సింగరేణి మూతపడే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. రిజర్వేషన్ కోటా లో బొగ్గు బ్లాక్ లు కేటాయించాలని కోరారు. రిజర్వేషన్ల అంశంలో కిషన్ రెడ్డి చొరవ చూపాలని అన్నారు. కిషన్ రెడ్డి అవకాశం ఇస్తే అఖిల పక్షంగా వచ్చి ప్రధానిని కలుస్తామని తెలిపారు. సింగరేణి సంస్థకు కొత్త గనులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. సింగరేణి సంస్థ బతకాలి అంటే కొత్త గనులు కేటాయించడం ఎంతో అవసరముందుని తెలిపారు. సత్తుపల్లి, కొయగూడ బ్లాక్ ల పాత లీజు రద్దు చేసి..వాటిని సింగరేణికి కేటాయించాలి కోరుతున్నామన్నారు. సింగరేణి భవిషత్ కోసం మరో 0.5 పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సింగరేణి సంస్థను కాపాడేందుకు చట్టంలో మార్పులు చేయాలని కోరుతున్నామని భట్టి కోరారు.



## నీళ్ల కోసం నీరాహార దీక్ష

### - ఢిల్లీలో నీటి కష్టాలను తీర్చాలని అతిషి డిమాండ్

న్యూఢిల్లీ (ప్రజా మంటలు): దేశ రాజధాని వాసులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. నీటి సంక్షోభంతో గత కొద్ది వారాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి సమస్యను కేంద్రం చక్కదిద్దాలని కోరుతూ ఢిల్లీ మంత్రి, ఆప్ నేత అతిషి శుక్రవారం ఢిల్లీలో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని నగర వాసుల నీటి కష్టాలను తీర్చాలని ఆమె డిమాండ్ చేస్తున్నారు. బీజేపీ పాలిత హరియాణ ప్రభుత్వం ఢిల్లీకి దక్కాల్సిన వాటా నీటిని విడుదల చేయడం లేదని ఆప్ ఆరోపిస్తోంది. మరోవైపు జల జగడంతో ఆప్, బీజేపీ పరస్పర విమర్శలకు దిగుతున్నాయి. నగర ప్రజల నీటి సమస్యను ఢిల్లీ ప్రభుత్వమే పరిష్కరించాలని బీజేపీ ఎంపీ మనోజ్ తివారీ పేర్కొన్నారు. అతిషి తమ సొంత ప్రభుత్వంపైనే నిరసనలకు దిగారని వ్యాఖ్యానించారు.

# నీట్‌పై ఆగని ఆందోళనలు

విషయాన్ని గమనించారు. ఈ రివ్యూను పరీక్ష జరిగిన రోజునే ఆయా కేంద్రాల్లో నిర్వహించారు. 399 సెంటర్లలో 186 చోట్ల పనిచేస్తున్న రెండు కెమెరాలు లేవు. వాస్తవానికి వీటినుంచి వీటి లైవ్‌ఫీడ్ దిల్లీలోని ఎన్‌టీఏ ప్రధాన కార్యాలయంలోని సెంట్రల్ కంట్రోల్ రూమ్‌కు వెళ్లాల్సిఉంటుంది. రివ్యూ బృందం పర్యటించిన వాటిల్లో 68 చోట్ల ప్రశ్నపత్రం భద్రపర్చిన గదికి గార్డులను రక్షణగా నియమించలేదు. నిబంధనల ప్రకారం ప్రశ్నపత్రం పంపిణీ చేసేవరకు కచ్చితంగా గార్డ్ రక్షణ ఉండి తీరాలి. 83 సెంటర్లలో బయోమెట్రిక్ జాబితాలో ఉన్న సిబ్బంది.. విధుల్లో ఉన్నవారు వేర్వేరు కావడం గమనార్హం. పరీక్ష రోజున ఏ సెంటర్‌లోనూ మాల్‌ప్రాక్టిస్ వంటివి జరగకుండా చూసేందుకు ఈ రివ్యూను నిర్వహిస్తారు. దీనికింద పరిశీలకులను థర్డ్ పార్టీ నియమిస్తుంది. వీరు ఎన్‌టీఏ నిబంధనల అమలుతీరును ఎలాఉందో గమనించి నివేదిక ఇస్తారు. నీట్ ప్రశ్నపత్రం లీకేజీ నిజమేనని తేలింది. ముందురోజు రాత్రే నీట్ ప్రశ్నపత్రం తమకు అందిందని బిహార్‌లో అరెస్టైన కొందరు విద్యార్థులు పోలీసుల ఎదుట అంగీకరించారు. మరోవైపు లీక్‌కు కీలక సూత్రధారి అయిన నిందితుడు ఒక్కో విద్యార్థి నుంచి రూ.30 లక్షల నుంచి రూ.32 లక్షలు వసూలుచేసినట్లు వెల్లడైంది. కాగా డాక్టర్లు అవుదామని ఆశపడిన 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడుతోందని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆరోపించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రతిష్టను దిగజార్చేలా నీట్ పేపర్ లీక్ స్కామ్ జరిగిందనే ఆధారాలు బయటపడ్డాయన్నారు. నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత కాంగ్రెస్ కమిటీ పిలుపుమేరకు విజయవాడలోని లెనిన్ కూడలిలో షర్మిల నిరసన కార్యక్రమం చేపట్టారు. పరీక్షకు ఆలస్యంగా వస్తే గ్రేస్ మార్కులు ఎలా ఇస్తారు? రెండు నిమిషాలు అదనపు సమయం ఇవ్వొచ్చు కదా అని ప్రశ్నించారు. అవకతవకలు జరిగినా ఎన్టీయే మీద ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. భాజపా ప్రభుత్వాలు అధికారంలో ఉన్న బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనే పేపర్ లీక్ అయిందన్నారు. ప్రశ్నపత్రం లీకేజీకి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు. పట్నా: దేశవ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్తతలు రేపుతున్న నీట్ పేపర్ లీక్ కేసులో భాజపా తనను ఇరికించాలని ప్రయత్నిస్తోందని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ మండిపడ్డారు. కేసులో నిందితుడిగా తేలిన వ్యక్తితో తేజస్వి వ్యక్తిగత సహాయకుడికి పరిచయం ఉందని భాజపా ఆరోపించింది. దీనిపై ఆయన స్పందిస్తూ పేపర్ లీకేజీకి కుట్ర చేసింది రాష్ట్ర ముఖ్యమంత్రి నీతీష్ కుమార్ అని వ్యాఖ్యానించారు. భాజపా అధికారంలోకి వచ్చినప్పుడల్లా పేపర్ లీకేజీలు జరుగుతున్నాయన్నారు."ఈ విషయంలో ఇండియా కూటమి ఐక్యంగా ఉంది. నీట్ పరీక్షను తక్షణమే రద్దు చేయాలని మేము కోరుతున్నాం. అన్ని కేంద్ర దర్యాప్తు సంస్థలు భాజపాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయి. ఈ కేసులో నా పీఏను, నన్ను లాగాలనుకున్నా ఎలాంటి ప్రయోజనం ఉండదు. పేపర్ లీక్‌కు అసలైన సూత్రధారులు అమిత్ ఆనంద్, నీతీష్ కుమార్‌లే" అని తేజస్వి ఆరోపించారు. ప్రధాన నిందితుడికి ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్‌కు సంబంధం ఉందని బిహార్ డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ సిన్హా ఆరోపించిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్జేడీ నేతలు తమ అధికారిక ఎక్స్ ఖాతాలో ఓ ఫొటోను పంచుకున్నారు. ఈ ఫొటోలో ప్రధాన నిందితుడు అమిత్ ఆనంద్ బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరితో ఉన్నారు. కేసులో ఆనంద్ పేరు బయటకు రాగానే అతడితో ఉన్న ఫొటోలన్నింటినీ ఉప ముఖ్యమంత్రి డిలీట్ చేశారన్నారు. కానీ అవన్నీ తమ వద్ద భద్రంగా ఉన్నాయని, వాటి ద్వారా అసలైన దోషులు ఎవరో తెలుస్తుందని పేర్కొన్నారు.

# పాత్రోచిత మాటల మాంత్రికుడు పాత్రో

## జూన్ 22... గణేష్ పాత్రో జయ



రామ కిష్టయ్య సంగన భట్ల...
9440595494



తెలుగు చిత్ర సీమ లో చెరగని సంతకం గణేష్ పాత్రో. సినిమాలను బట్టి, పాత్రలకు సమయోచితంగా, సందర్భాను సారంగా మాటలు రాయడంలో ఆయనకు ఆయనే సాటి. దర్శకుడి ఆలోచనలను అర్థం చేసుకుని, అందుకు అను గుణంగా సంభాషణలు రాయడం అన్నది మామూలు విషయం కాదు. అంత సులువు కానే కాదు. దర్శకుని మనోభావాలు ప్రతిబింబించేలా రచయిత సంభాషణలు రాస్తేనే సదరు సినిమా ప్రేక్షకుల ఆదరాన్ని చూర గొంటున్నదన్న మాట యదార్థం. కొందరు దర్శకులకు, కొందరు రచయితలతో కలిసి పనిచేయడం చాలా అనుకూలంగా ఉంటుంది. బహుశా, ఈ కారణంగానే చాలామంది రచయితలకు ఎక్కువ మంది దర్శకులతో పనిచేసే అవకాశం దొరకదు. కానీ, గణేష్ పాత్రోకు తన సినీ రంగ కలిసి చేసిన ప్రయాణంలో దర్శకులందరూ వైవిధ్యాన్ని కోరుకునే వారే. వెండితెర మీద తమదైన ముద్ర వేదుకున్న వారే. బాల చందర్ తో పాటు, సింగీతం శ్రీనివాసరావు, క్రాంతికుమార్ వంశీ, కోడి రామకృష్ణ, ఇంకా నేటితరం దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల ఎవరి శైలి వాళ్ళది. తెలుగు వెండితెరపై ఎవరి ప్రత్యేకత వారిది. వారు కోరుకున్న విధంగా, వారి అభిరుచులకు అనుగుణంగా సంభాషణలు రాసి మెప్పించిన ఘనత మాత్రం గణేష్ పాత్రోదే. గణేష్ పాత్రో కథలు, నాటికలు సమకాలీన పరిస్థితులకి, మధ్య తరగతి కుటుంబాలలోని మనుషుల అంతరంగాలు, సంఘర్షణలకు ప్రతి బింబాలుగా నిలుస్తాయి. అందుకే దర్శకులు నిర్మాతలు ఆయన రచనలు ఇష్ట పడ్డారు. ప్రేక్షకులు ఆదరించారు.

గణేష్ పాత్రో పేరు చెప్పగానే వెంటనే గుర్తుకు వచ్చే మరో పేరు కె. బాలచందర్. పందొమ్మిది వందల డెబ్భై, ఎనభై దశకాల్లో తెలుగు తెరమీద బాలచందర్, పాత్రో కాంబినేషన్ విజయాల పరంపర కొనసాగించు కుంది. బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన ప్రతి చిత్రానికి తెలుగులో గణేష్పాత్రోనే సంభాషణలు రాశారు. బాల చందర్ తమిళ ఆలోచనలకు అచ్చ తెలుగు మాటలను అద్దిన రచయిత గణేష్ పాత్రో. అందుకే కాబోలు బాలు, స్వప్న, జానీ, సుహాసిని, బుచ్చిబాబు, విద్య, బేబీ.. ఈ పాత్రలేవీ కూడా పరభాషా దర్శకుడు సృష్టించినవన్న భావన కలగదు. సినిమాకు స్థానికత అద్దడంలో సంభాషణలది కీలక పాత్ర. బాలచందర్ దర్శకత్వం వహించిన మరో చరిత్ర, గుప్పెడు మనసు, ఆకలి రాజ్యం, రుద్ర వీణ, ఇది కథకాదు లాంటి పలు చిత్రాలు గణేష్ పాత్రోకు మంచి పేరు తెచ్చి పెట్టాయి. దర్శకుడు కే.బాల చందర్తో గణేష్పాత్రో అనుబంధం విడదీయ రానిది. అందుకేనేమో బాలచందర్ మరణించిన రెండు వారాలకు గణేష్ పాత్రో ఆయనను అనుసరించి వెళ్లడం గమనార్హం.

సీనియర్ దర్శకుడు కోడి రామకృష్ణ, గణేష్ పాత్రోల కలయికలో 40 చిత్రాలు తెరకెక్కడం విశేషం. ముఖ్యంగా భార్గవ ఆర్ట్స్ పిక్చర్స్ అధినేత దివంగత ఎస్ గోపాల్ రెడ్డికి ఆస్థాన రచయితగా గణేష్ పాత్రో వ్యవహరించారు. అలాగే, ప్రముఖ దర్శకుడు క్రాంతికుమార్తో కలసి పలు చిత్రాలకు పనిచేశారు. గణేష్పాత్రో స్వాతి చిత్రానికి 1983లో, రుద్రవీణ చిత్రానికి గాను 1988లో ఉత్తమ నంది అవార్డులను అందుకున్నారు. మయూరి చిత్రానికి గాను ఉత్తమ స్క్రీన్ ప్లే రచయితగా నంది అవార్డును దక్కించు కున్నారు. 2009లో ఆయన అభిమానంగా ప్రేమించే అక్కినేని నాగేశ్వరరావు పురస్కారాన్ని, 2013లో మనసు కవి ఆత్రేయ బిరుదును అందుకున్నారు.

గణేష్ పాత్రో విజయ నగరం జిల్లా పార్వతీ పురంలో 1945 జూన్ 22న ఆది లక్ష్మీనారాయణ పాత్రో, సూర్యకాంతం దంపతులకు జన్మించారు.

గణేష్ పాత్రో తండ్రి, పార్వతీపురం దగ్గర ఒక చిన్న గ్రామానికి కరణంగా పనిచేసేవారు. గణేష్ ప్రాథమిక విద్య అక్కడే సాగింది. పార్వతీ పురంలో ఉన్నత చదువులు చదువుతూ, నాటకాలలో నటించడం ప్రారంభించారు. పాఠశాల పుస్తకాలతో పాటు సాహిత్యాన్ని కూడా చదవటం ప్రారంభించారు. పీ.యూ.సి పూర్తయిన తర్వాత పై చదువులకు ఆంధ్ర విశ్వ విద్యాలయంలో చేరారు. అక్కడ విశ్వ విద్యాలయ సాంస్కృతిక సంఘానికి జాయింట్ సెక్రటరీగా నాటకాలు వ్రాయటం, వాటిని రంగస్థలంపై ప్రదర్శించడం ప్రారంభించారు. చిన్నప్పటి నుంచే నాటకాలు రాయడం, నటనపై గణేశ్ పాత్రో ఆసక్తి పెంచుకున్నారు. 'పావలా', 'కొడుకు పుట్టాల', 'ఆలోచించండి' వంటి పలు నాటకాలతో రచయితగా ప్రాచుర్యం పొందారు. ఇందులో 'కొడుకు పుట్టాల' నాటకానికి అంతర్జాతీయ పురస్కారం లభిం చింది. ఈ నాటకం పలు భాషల్లో అనువాదం కావడంతో పాటు ఆకాశవాణి, దూరదర్శన్ లలో ప్రసారమై, పాత్రో కు గుర్తింపు తెచ్చాయి.

1970 ప్రాంతంలో రచన ప్రారంభించిన గణేష్ పాత్రో అయిదేళ్ళ కాలంలో ప్రథమ శ్రేణి నాటక కర్తగా పేరు తెచ్చుకున్నారు. రచనలు చాలా తక్కువే అయినా, వ్రాసిన ప్రతి నాటిక, నాటకము రంగస్థలం మీద రక్తి కట్టి రసజ్ఞుల మెప్పు పొందింది. కథా వస్తువును పరి గ్రహించడంలో, కథనంలో, పాత్ర చిత్రణలో, సన్నివేశాల మేళవింపులో, మాటల కూర్పులో నిత్య నూతన పరిమళాన్ని వెదజల్లిన ప్రతిభాశాలి గణేష్ పాత్రో. సంఘటనల ద్వారా సమస్యను శక్తివంతంగా ఆవిష్కరించటం అయన రచనా విధానంలో ప్రత్యేకత. మృత్యుం జయుడు, తెరచి రాజు, తరంగాలు, అసుర సంధ్య నాటకాలూ, కొడుకు పుట్టాల, పావలా, లాభం, త్రివేణి, ఆగండి! కొంచెం ఆలోచించండి మొదలైన నాటికలు తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని దోచుకున్న ఉత్తమ రచనలు. 1970 నుండి 1990ల వరకు అనేక సినిమాలకు సంభాషణలు, కథను సమ కూర్చారు. 125కు పైగా చిత్రాలకు కథలు, మాటలను అందించారు. పదిహేనేళ్ళ విరామానంతరం సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాకు సంభాషణలు సమకూర్చారు. "హలో గురూ ప్రేమ కోసమేరా ఈ జీవితం"... నిర్ణయం సినిమాలో పాట రాశారు. అదే ఆయన సంభాషణలు రాసిన చివరి చిత్రం.

ఆయన సినీ సంభాషణలు సమకూర్చిన చిత్రాల్లో సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, నిర్ణయం, సీతారామయ్య గారి మనవరాలు, రుద్రవీణ, తలంబ్రాలు, ప్రేమించు పెళ్ళాడు, మయూరి, మనిషికో చరిత్ర, గుప్పెడు మనసు, ఇది కథ కాదు, మాపల్లెలో గోపాలుడు ఇలా పలు హిట్ చిత్రాలు ఉన్నాయి.

సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (2013) (సంభాషణలు, శ్రీకాంత్ అడ్డాలతో కలిసి), 9 నెలలు (2001), నిర్ణయం (1991) (సంభాషణలు, పాటలు), సీతా రామయ్య గారి మనవరాలు (1991), రుద్రవీణ (1988), గౌతమి (1987), తలంబ్రాలు (1986),
ప్రేమించు పెళ్ళాడు (1985),
మయూరి (1984), మనిషికో చరిత్ర (1984), గుప్పెడు మనసు (1979) (సంభాషణలు), ఇది కథ కాదు (1979), మరో చరిత్ర (1978),
అత్తవారిల్లు (1976) తదితర చిత్రాలకు పనిచేశారు.
క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చెన్నైలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొంది, గణేష్ 69 ఏళ్ళ వయసులో 2015, జనవరి 5న తెలుగు సినిమా పుస్తకంలో చెరగని సంతకం చేసి కన్నుమూశారు.

# పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసే కఠిన చర్యలు

## - మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరిక



హైదరాబాద్ (ప్రజా మంటలు):
రైస్ మిల్లర్లకు ప్రభుత్వం నుంచి ఎలాంటి వేధింపులు ఉండవని పౌర సరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మాదాపూర్ హైటెక్స్లో మూడు రోజుల పాటు జరిగే మూకాంబికా రైస్, గ్రెయిన్టెక్ ప్రదర్శనను మంత్రి ప్రారంభించారు. ప్రదర్శనలో బహుళజాతి, ప్రైవేట్ కంపెనీలకు చెందిన 120 స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ రైస్ మిల్లింగ్ పరిశ్రమను ముఖ్యమైన రంగంగా గుర్తిస్తామన్నారు. రైస్ మిల్లింగ్ వ్యాపారం, అనుమతులు, స్థాపన సులభతరం చేస్తామని ఆయన తెలిపారు. రైతులు, మిల్లర్లకు మేలు జరిగేలా చూస్తామన్నారు.నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకే ప్రజలకు అందించాలని సూచించారు. మిల్లర్లు ఎవరూ పీడీఎస్ బియ్యం జోలికి వెళ్లవద్దన్నారు. పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన ఆయన హెచ్చరించారు.గత ప్రభుత్వంలో పౌరసరఫరాల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధుల జోక్యంతో సివిల్ సప్లయ్ వ్యవస్థపై నమ్మకం పోయిందని మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పౌరసరఫరాల వ్యవస్థపై నమ్మకం నిలబెట్టుకోవాల్సిన బాధ్యత రైస్ మిల్లర్లపై ఉరని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏ రైస్ మిల్లర్ కూడా ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం జోలికి వెళ్లవద్దని మంత్రి స్పష్టం చేశారు.హైదరాబాద్ మాదాపూర్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో మూడు రోజులపాటు జరగనున్న 16వ మూకాంబికా రైస్, గ్రెయిన్టెక్ ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్- 2024ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. బహుళ జాతి, ప్రవేటు కంపెనీల ఆధ్వర్యంలో 120 స్టాళ్లు కొలువు తీరాయి. పలు స్టాళ్లను కలియ తిరిగి మంత్రి పరిశీలించారు. పలు దేశాల బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు, దేశీయంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడారు.రాష్ట్రంలో పలువురు మిల్లర్లు అక్రమాలకు పాల్పడుతున్నారని మంత్రి ఉత్తమ్కుమార్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఎఫ్సీఐ, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో 40 రూపాయలకు సేకరించి 6 కిలోల చొప్పున నిరుపేదలకు ఇస్తుంటే, ప్రజా పంపిణీ బియ్యాన్ని పలువురు మిల్లర్లు రీసైక్లింగ్ చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని హెచ్చరించారు. కొందరు చట్ట విరుద్ధంగా వ్యాపారం చేస్తున్నందున కఠిన చర్యలు తీసుకుంటామని తేల్చిచెప్పారు. కీలక వ్యవసాయ అనుబంధంగా రైస్ మిల్లింగ్ పరిశ్రమను ప్రభుత్వం ముఖ్యమైన రంగంగా గుర్తిస్తుందని అన్నారు.గ్రామీణ తెలంగాణలో అతి పెద్ద ఉపాధి రంగం దృష్ట్యా ప్రత్యక్షంగా పరోక్షంగా 3 లక్షల మంది జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. నిజాయితీగా ఉంటే రైస్ మిల్లర్లపై వేధింపులు ఉండవని, ఈజ్ ఆఫ్ డూయింగ్?లో వ్యాపారం, అనుమతులు, స్థాపన సులభతరం చేస్తామని భరోసా ఇచ్చారు. రైతులు, మిల్లర్లకు మేలు జరగాలన్న లక్ష్యం మేరకు కేంద్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు, బ్యాంకుల సహకారం విషయంలో సర్కారు సహకరిస్తుందని చెప్పారు.'కొందరు మిల్లర్లు ప్రజాపంపిణీ వ్యవస్థలో అక్రమాలకు పాల్పడుతున్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాము. పౌరసరఫరాల వ్యవస్థపై నమ్మకం నిలబెట్టుకోవాల్సిన బాధ్యత రైస్ మిల్లర్లపై ఉంది. నిజాయితీగా ఉంటే రైస్ మిల్లర్లపై వేధింపులు ఉండవు. ఈజ్ ఆఫ్ డూయింగ్?లో వ్యాపారం, అనుమతులు, స్థాపన సులభతరం చేస్తాము"



# రాగల మూడు రోజుల్లో భారీ వర్షాలు

హైదరాబాద్ (ప్రజా మంటలు):
తెలంగాణలో రానున్న మూడు రోజుల్లో భారీ ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ ప్రకటించింది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాల్లో శనివారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వర్షాలు కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.ఆదివారం నాడు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉంది. నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్, నారాయణపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. సోమవారం సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, మహబూబ్నగర్, నాగర్కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.



# నీట్ పేపర్ లీక్..

## - కౌన్సెలింగ్ వాయిదాకు సుప్రీం నో..



దిల్లీ (ప్రజా మంటలు):
వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన 'నీట్-యూజీ ప్రవేశ పరీక్ష 2024' పేపర్ లీక్ అయ్యిందని తేలడం తీవ్ర దుమారం రేపుతోంది.ఈ క్రమంలో పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. ఇందుకు సంబంధించి తాజాగా దాఖలైన పిటిషన్లను విచారించిన సుప్రీం ధర్మాసనం.. కౌన్సెలింగ్ ప్రక్రియను వాయిదా వేసేందుకు నిరాకరించింది. జులై మొదటి వారంలో నీట్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలు కానున్న సంగతి తెలిసిందే.నీట్ పరీక్ష వ్యవహారంపై దర్యాప్తు జరిపించడంతోపాటు ఆ పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని కోరుతూ దాఖలైన కొత్త పిటిషన్లపై జస్టిస్ విక్రమ్నాథ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టీలతో కూడిన వెకేషన్ బెంచ్ విచారించింది. వీటిపై దాఖలైన పిటిషన్లను జులై 8 నుంచి విచారించనున్నందున.. జులై మొదటి వారంలో మొదలు కానున్న కౌన్సెలింగ్ను వాయిదా వేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరారు. అందుకు నిరాకరించిన సుప్రీం ధర్మాసనం.. తాజాగా దాఖలైన పిటిషన్లపై స్పందన తెలియజేయాలని ఎన్టీఏకు నోటీసులు జారీ చేసింది. వీటిని పెండింగ్ పిటిషన్లతో కలిపి జులై 8న విచారిస్తామని పేర్కొంది.మరోవైపు మేఘాలయలోని ఓ పరీక్ష కేంద్రంలో నీట్కు హాజరైన అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్పై కేంద్రంతోపాటు ఎన్టీఏకు సుప్రీం కోర్టు నోటీసులు జారీచేసింది. పరీక్ష సమయంలో తాము 45 నిమిషాలు నష్టపోయామని, గ్రేస్ మార్కులు పొందిన 1563 అభ్యర్థుల జాబితాలో తమను చేర్చి.. జూన్ 23న నిర్వహిస్తోన్న పరీక్షకు అవకాశం కల్పించాలని కోరారు.

# మరో సమరానికి ఈసీ సై

## - జమ్మూకశ్మీర్ సహా 3 రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు

దిల్లీ (ప్రజా మంటలు):
జమ్మూకశ్మీర్తో పాటు హరియాణా ఝార్ఖండ్ మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు మొదలుపెట్టింది.ఆగస్టు 20 నాటికి ఓటర్ల సవరణ ప్రక్రియ పూర్తి చేసి తుది జాబితాను ప్రకటించాలని నిర్ణయించింది. ఈమేరకు ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంత ప్రధాన ఎన్నికల అధికారులకు మార్గదర్శకాలు జారీ చేసింది. ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు వీలుగా అవసరమైనచోట కొత్తగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ జూన్ 25 నుంచి ప్రారంభమవుతుందని ఈసీ వెల్లడించింది. జులై 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించనున్నట్లు స్పష్టం చేసింది. జులై 25న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రకటిస్తామని, ఆగస్టు 9 వరకు అభ్యంతరాలను స్వీకరించిన అనంతరం షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 20న తుది జాబితా విడుదల చేస్తామని పేర్కొంది.2018లో జమ్మూకశ్మీర్ అసెంబ్లీ రద్దయిన తర్వాత నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఆ తర్వాత అక్కడ అసెంబ్లీ ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో జమ్మూకశ్మీర్ ఓటర్ల నుంచి విశేష స్పందన వచ్చింది. ఈ క్రమంలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని ఈసీ నిర్ణయించింది. అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అక్కడి అధికారులను ఆదేశించింది. మరోవైపు హరియాణా అసెంబ్లీ గడువు నవంబర్ 11తో ముగుస్తుండగా.. మహారాష్ట్ర అసెంబ్లీ గడువు నవంబర్ 26, ఝార్ఖండ్ అసెంబ్లీ గడువు జనవరి 5, 2025తో ముగియనుంది. ఈనేపథ్యంలో వీటన్నింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. మరోవైపు ఎన్నికలు జరగబోయే రాష్ట్రాల ఉన్నతాధికారులతో ఈసీఐ వారం రోజుల్లో సమావేశం కానుంది.

# కులరహిత సమాజం మన లక్ష్యం కావాలి !

కులరహిత సమాజం కావాలని అందరూ కోరుకుంటున్నారు. కానీ వారే మళ్లీ కులాల కుంపట్లు పెడుతున్నారు. మొన్నటి ఎన్నికల్లో కులగణన ప్రధాన అంశంగా మారింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కులగణన చేపడతామని హామీ ఇచ్చింది. ఇది ఓ రకంగా కాంగ్రెస్‌కు ఇండియా కూటమికి కలసి వచ్చింది. అందుకే కూటమి సీట్లు పెరిగాయి. బిజెపి సీట్లు తగ్గాయి. దేశంలో రాజకీయ పార్టీలు కులాలను ఎగదోస్తూ పబ్బం గడుపుకుంటున్నాయి. నిజానికి ఆర్థిక సర్వే జరగాలి. ఏకులంలో ఎంతమంది అన్నది కాకుండా కేవలం ఆర్థిక పరిస్థితులను మదింపు చేసి కుటుంబాల సంఖ్యను లెక్క తీస్తే వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అమలయ్యేలా చేయాలి. ఆర్థికంగా కుంగిపోతున్న వారిని కులాలుగా కాకుండా దారిద్య్ర రేఖకు దిగువన ఉన్నవారిగా చూడాలి. కానీ రాజకీయ పార్టీలు ఓట్ల కోసం ఇలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. ప్రజలు కూడా కులాలు ఉండాలనే కోరుకుంటున్నారని, మొన్నటి ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయి. యూపిలో ఫలితాలే ఇందుకు నిదర్శనం. అందుకే కులాలు, మతాలు ఉండవద్దంటున్న వారే ఉమ్మడి పౌరస్మృతి అనగానే ఉలిక్కి పడుతున్నారు. ఈ విషయంలో కమ్యూనిస్టులు ముందుంటారు. వారి తరవాత ముస్లిం ఓట్ల భయంతో కాంగ్రెస్ తదితర పార్టీలో జతకడతాయి. దేశంలో ఉమ్మడి పౌరస్మృతి అన్న పదం రాగానే ఈ పార్టీలకు వణుకు పుడుతుంది. దేశం ఏమైనా ఫర్వాలేదు. దేశంలో ఓట్లతో లబ్ది పొందడమే వారికి కావాలి. కులాలు వద్దంటారు. మతాలన్నీ సమానమంటారు. అందరిలో ప్రవహించేది ఒకే రక్తం అంటూ గొంతు చించుకుంటారు. చట్టం వద్దకు వచ్చే సరికి కులాలు మతాల ఆధారంగా చట్టాలు ఉండాలంటారు. బిసిలకు వేరు.. .ఎస్సీలకు వేరు..మైనార్టీలకు వేరు..ఇలా అనేక రకాల చట్టాలు ఉండాలని కోరుకుంటున్న రాజకీయ నేతలకు బుద్ది చెప్పాల్సిన సమయం వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా మార్పులు వస్తున్నాయి. ప్రజలంతా ఒక్కటే అన్న భావన పెరుగుతోంది. ప్రజలంతా ఒకే విధమైన చట్టానికి కట్టుబడి ఉండాల్సిందే. కులాలు, మతాల వారీగా చట్టాలను అమలు చేయడం కుదరదని గుర్తించాలి. ఒకేదేశం.. ఒకే చట్టం నినాదం చట్టంగా మారితేనే..దేశంలో ఐక్యత సాధిస్తాం. ఇంతకాలం ఇలా నినదించిన బిజెపి ఇప్పుడు తన లక్ష్యానికి అనుగుణంగా దేశంలో కులరహిత సమాజం కోసం ముందుకు సాగాలి. నిజానికి కుల, మతాచారాలు వేరు. చట్టాలు వేరు. ఒకరి ఆచారాలను మరొకరు గౌరవించాల్సిందే. ఎవరి అంతర్గత ఆచారాలను కూడా విమర్శించడం లేదా తక్కువ చేయడం సరికాదు. దానికీ చట్టాలకి తేడా ఉంది. ఉమ్మడి పౌరస్మృతి అంటే ఎలా ఉంటుందో కేంద్ర ప్రభుత్వం ఒక ముసాయిదా చట్టాన్ని రూపొందించాలి. ప్రపంచంలో అనుసరిస్తున్న విధానాలు పరిశీలించాలి. రాజకీయాలతో సంబంధం లేకుండా కఠినంగా ముందుకు సాగాలి. దొంగతనాలు, దోపిడీలు, పెళ్లిళ్లు, విడాకులు వంటి విషయాల్లో చట్టాలు మానవులందరికీ ఒకే రకంగా ఉండాలి. కులానికో, మతానికో పద్దతి అంటూ ఉండరాదు. దీనిపై ప్రజల్లో కూడా చర్చ చేయించాలి. చర్చకు పెడితే ఇప్పటివరకు ఉన్న అనేక అపోహలు తొలగిపోతాయి. మోడీ సర్కార్ గత పది సంవత్సరాలుగా ఉమ్మడి పౌరస్మృతి గురించి చెబుతున్నా నేటికీ దానిని చట్టరూపంలోకి తీసుకురాలేదు. రాజ్యాంగబద్ధమైన నిర్ణయం ఇప్పటికీ తీసుకో లేదు. ఉమ్మడి పౌరస్మృతిని ముస్లింలు లేదా ఇతర మతం వారెవరైనా గుడ్డిగా వ్యతిరేకించాల్సిన అసవరం కూడా లేదు. మానవులుగా మన హక్కులకు భంగం కలగ కుండా చూడాలి. ఉమ్మడి పౌరస్మృతి అనగానే ముస్లింలను లక్ష్యంగా చేసుకున్నారని రాజకీయ పార్టీలు చేస్తున్న విమర్శలు లేదా ఆరోపణలను ప్రజలే తిప్పి కొట్టాలి. ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడుతున్న రాజకీయ పార్టీల తీరును ప్రతి ఒక్కరూ ఎండగట్టాల్సిందే. ఎందుకంటే ఇప్పటికే మతప్రాతిపదికన దేశం విచ్ఛిన్నం అయ్యింది. ఇంకా కులాలు, ప్రాంతాలుగా, మతాలుగా దేశాన్ని విభజించాలన్న భావన నుంచి బయటపడాలి. ప్రజలంతా ఒక్కటిగా చట్టానికి లోబడే వ్యవహారాల్లో కులమతాలకు ప్రాధాన్యం ఉండరాదు. ఏ మతానికి చెందిన వారయినా ఇతర మతాల వారితో సఖ్యంగా ఉండాల్సిందే. పరస్పరం గౌరవించు కోవాల్సిందే. కులం,మతంపట్టింపులు లేనివారు కూడా దీనిని బలంగా నమ్ముతున్నారు. దళితులు, గిరిజనులకు రిజర్వేషన్లు వేరు. ఆర్థికంగా వెనకబడిన వారిని ఆదుకోవడం వేరు. ప్రజల ఆర్థిక స్థితిగతుల ఆధారంగా వారికి ప్రభుత్వ పథకాలు అందాల్సిందే. కులాల వారీగా పథకాలు అన్నది సరికాదు. ఆర్థిక వెనకబాటు కారణంగా ఏ కులమైనా..ఏ మతమైనా లబ్ది పొందాల్సిందే. ఉమ్మడి చట్టం లేకుంటే రానురాను ఇంకా కులాలు, మతాల వారిగా చట్టాలు కావాలని కోరేవారి డిమాండ్ పెరుగుతుంది. ఇది దేశ విచ్ఛిన్నానికి దారితీస్తుంది. మేం ఫలాన మతం లేదా కులాల వారం కనుక..మాకు ఇన్ని ఓట్లు ఉన్నాయి కనుక మాకు చట్టం వేరుగా ఉండాలన్న డిమాండ్ వచ్చినా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. హిందూమతంలోనే కులాల వారీ భిన్న ఆచారాలు,భిన్న వ్యవహారాలు ఉన్నాయి. వీరిని వర్గాలుగా గుర్తించి ప్రత్యేక చట్టాలను రూపొందించలేదం. కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేస్తే అదేదో ముస్లింలకు సంబంధించిందని ఇప్పటికీ గోల చేస్తున్నారు. అక్కడి కొన్ని పార్టీలు ఇంకా 370 పునరుద్దరణ జరగాలని కోరుకుంటున్నాయి. వారికి ప్రజల బాధలు పట్టవని గుర్తించాలి. దేశంలో ఒక్కో ప్రాంతానికి ప్రత్యేక చట్టాలు ఉంటే ఎంతటి అనర్థాలకు దారితీస్తుందో కశ్మీర్ పాఠాలు చెబుతాయి. దేశం నుంచి విడివడ్డ పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలో హిందువుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో వేరుగా చెప్పనక్కర లేదు. ఒక కులానికి చెందిన వారు మరో కులం, మతానికి చెందిన వారిని వివాహం చేసుకో కూడదని తీర్మానాలు చేస్తున్న పంచాయత్‌లు సాగుతూనే ఉన్నాయి. పరువు హత్యలకు పాల్పడుతున్నారు. ఇవన్నీ సమ్మతమా అన్నది ఆలోచన చేయాలి. ఒకప్పటి సతీసహగమనాన్ని తన్ని తరిమేసాం. అంటరానితనాన్ని రూపుమాపుకున్నాం. అస్పృశ్యతను రూపుమాపుకున్నాం. ప్రపంచంలో మార్పులు వస్తున్నాయి. ఏకధృవ ప్రపంచం ఏర్పడ్డది. ఇలాంటి సందర్భలో ప్రజలంతా ఒక్కటే అన్న భావన వచ్చింది. అయినా ఇంకా ఎవరికి వారు తమ కులాన్ని, మతాన్ని రాజకీయ అవసరాల కోసం మార్చాలని చూస్తున్న తీరు ఉపేక్షించ రాదు. అందుకే చట్టాలు పటిష్టంగా ఉండాలి. కఠినంగా వాటిని అమలు చేస్తూ ఉండాలి. ఇప్పటికే రాష్ట్రాల వారీగా చట్టాలు ఉన్నాయి. వీటినీ సమీక్షించాలి. దేశవ్యాప్తంగా ఒకే చట్టం ఉండాలి. ప్రజలను ఒక్కటి చేసేలా చట్టాలు ఉండాలి. రాష్ట్రాలు ఇష్టం వచ్చినట్లుగా చట్టాలు చేయడం, బుజ్జగింపు చర్యలు తీసుకోవడం సరికాదు. ఈ అసమానతలు తొలగాలి.ఇలాంటి స్థితిలో అందరూ సమానమే, ఒకటే అనే భావనను అంగీకరించాల్సిందే. అప్పుడే దేశం ఒక్కటిగా ఉంటుంది. ఉమ్మడి పౌరస్మృతి మాత్రమే దీనికి పరిష్కారం చూపగలదు. దీనికోసం ఇంకా కాలయాపనచేయడం సరికాదు. రాజకీయ పార్టీల అభిప్రాయాల ను తీసుకుంటూనే..దేశహితం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగాలి. ఎన్‌డి కూటమి నేతలే ఇందుకు అడుగు వేయాలి. రాజ్యాంగ రచయిత అంబేద్కర్ స్ఫూర్తి మరింత ఆదర్శం కాగలదు. దేశాన్ని కట్టిపడేసి భారత్ ఒక్కటే అన్న భావనను తీసుకుని రావాలి.

## కవిత్వం

### నిరీక్షణ

నీ రాకకై నిరీక్షణ ఎంతో
క్షణమొక శకంలా!

ఎటుచూసినా నీవే.....
వెన్నెల వెలుగులో
నక్షత్రాల మధ్యలో
పారే సెలయేరులో
ప్రకృతి పచ్చదనంలో!!

వస్తావని ఎదురుచూశా.....
సుప్రభాత వేళలో
ఉదయపు ఉషస్సులో
సద్దుమణిగిన సమయంలో
జాబిల్లి వెలుగుల్లో!!

ఎదురుచూసా.....
కలలోనైనా కనిపిస్తావని
ఆ ఎదురుచూపులో
నిదురే రాలేదు..... !!

జగ్గయ్య.జి
9849525802

### పాలిట్రిక్స్

రుణమాఫీ
కసరత్తు
పాలకుల
మల్లగుల్లాలు,
కండీషన్లతో కళ్లెం
యోచన
అయోమయంలో
రైతులు !

అప్పుడొక మాట
అటెనక ఒక
మాట,
పాలకులు
మారినా
పద్ధతి గదేనంట !

న్యాలకంటి
నారాయణ
ఫోన్
9346200066

# రేవ్ పార్టీ - పాశ్చాత్య విష సంస్కృతి

రేవ్ పార్టీల ఆవిర్భావం, వందల సంవత్సరాలకు పూర్వం పాశ్చాత్య దేశాలలో పార్టీలంటే లింగ బేధం లేకుండా అలవాటున్న వారందరూ ఒకచోట చేరి కేవలం మద్యం సేవించడం. కాలక్రమంలో ఈ పార్టీలు మార్పు చెందుతూ మద్యం సేవించడంతో పాటు డ్యాన్స్ చేసే పార్టీలుగా రూపుదిద్దుకున్నాయి. 1990 నాటికి ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో ఈ డాన్స్ పార్టీలలో మద్యంతో పాటు అమ్మాయిలతో అశ్లీల నృత్యాలు చేయించడమే కాకుండా, యాంఫేటమిన్, ఎల్ఎస్‌డీ, కెటామైన్, మెథాంఫేటమిన్ , కొకైన్ , గంజాయి వంటి మాదకద్రవ్యాలు రహస్యంగా వినిగించడం ప్రారంభమై రేవ్ పార్టీల విష సంస్కృతి ప్రపంచానికి పరిచయమైంది.

**భారతదేశంలో రేవ్ పార్టీల వ్యాప్తి**

భారతదేశంలో పాశ్చాత్య సంస్కృతి రోజురోజుకు పెరిగిపోతోంది. ఈ క్రమంలోనే పాశ్చాత్య దేశాల రేవ్ పార్టీల సంస్కృతి మనదేశంలో కూడా వ్యాప్తి చెందుతుంది. సెలెబ్రిటీలు, డబ్బున్న బడాబాబులు అక్కడే చదువుకోవటమో, లేదా తీరిక సమయాల్లో అక్కడికి వెళ్లి తనివితీరా ఎంజాయ్ చేసి వస్తుండటమో జరుగుతోంది. ఇలా అక్కడున్న కొన్ని కల్చర్ల రుచికి అలవాటు పడిన సెలెబ్రిటీలు, ప్రముఖుల పిల్లలు అదే ట్రెండ్ ను ఇక్కడ కూడా కొనసాగించే ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా మన దేశానికి వచ్చిందే ఈ రేవ్ పార్టీ. భారతదేశంలో రేవ్ పార్టీల ధోరణి గోవా నుంచి ప్రారంభమైంది. హిప్పీలు దీనిని గోవాలో ప్రారంభించారు. తరువాత ఇటువంటి పార్టీల ధోరణి అనేక నగరాల్లో పెరుగుతూ వచ్చింది. గత కొన్ని సంవత్సరాలుగా హిమాచల్ లోని కులు లోయ, బెంగుళూరు, పూణే, ముంబై వంటి అనేక నగరాలు వీటికి హాట్‌స్పాట్‌లుగా నిలిచాయి.

**రేవ్ పార్టీలు జరుపుకునే విధానం**

కాస్త వైల్డ్ బిహేవియర్‌తో చేసుకునే ఈ రేవ్ పార్టీలో పాల్గొనే వారిని రేవర్స్ అని పిలుస్తారు.రేవ్ అన్న పదం జమైకా భాష నుంచి వచ్చింది. చెవులు దద్దరిల్లే మ్యూజిక్‌తో ఈ పార్టీలలో యువతీ యువకులు ఆల్కహాల్ తో పాటు డ్రగ్స్ ను కూడా తీసుకుంటూ చీకటి లో లేజర్ లైట్ల వెలుగులో మ్యూజిక్ ను ప్లే చేస్తుంటే ఒళ్ళు మరిచి వివేకం కోల్పోయి వాయవరసలు లేకుండా డాన్సులు చేస్తుంటారు.యువత అన్నీ మరిచి చిందులు వేయడానికి ఈ రేవ్ పార్టీలో అన్ని ఏర్పాట్లు ఉంటాయి. ఈ రేవ్ పార్టీ కల్చర్ చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు వేదికగా మారుతుంది.

రేవ్ పార్టీ సుదీర్ఘంగా సాగే పార్టీ. ఈ పార్టీలో పాల్గొనాలంటే పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుంది. రేవ్ పార్టీలు 24 గంటల నుంచి మూడు రోజుల వరకు నిర్వహిస్తారు.ఒకప్పటి రాక్ 'ఎన్ రోల్ యుగం, హిప్పీ యుగం, డిస్కో మరియు ర్యాప్ లాగా ఇప్పుడు ఈ రేవ్ యుగం. అయితే వీటన్నిటికంటే ఈ " రేవ్" ది ఏ హద్దులు లేని విచ్చలవిడి సంస్కృతి. ఈ రేవ్ పార్టీలో పాల్గొనాలంటే మద్యం సేవించడం, డ్రగ్స్ తీసుకోవడం, విచ్చలవిడిగా వ్యభిచారం చేయడం మరియు అవసరానికి మించిన ధనం కలిగి ఉండటం లాంటి అవలక్షణాలు ఉండాలి.అందుకే ఈ రేవ్ పార్టీలకు ఎంపిక చేసిన కొంతమందికి మాత్రమే అవకాశం కల్పిస్తారు. గోప్యతపై పూర్తి శ్రద్ధ వహిస్తారు.

**రేవ్ పార్టీలో పాల్గొన్న వ్యక్తుల భావజాలం**

"రేవ్" అంటే మంచైనా చెడైనా హద్దు లేకుండా ప్రవర్తించడమే.హద్దులు, జాత్యహంకారం, పక్షపాతం, లింగభేదం, నియమాలు, తుపాకీలు మరియు ద్వేషం ఇలాంటివి ఏమీ లేకుండా కేవలం శాంతి, ప్రేమ, ఐక్యత మరియు గౌరవంతో నిండిన ప్రపంచం లోకి తీసుకెళ్లడమే "రేవ్" సంస్కృతని సమర్థించుకునే ప్రబుద్ధులు కూడా ఉన్నారు.నిజమే డ్రగ్స్ కు బానిసలైన మనుషులకు ఇవేవీ ఆలోచించే స్పృహ ఉండదు కదా. దేశానికి వెన్నెముకగా



నిలవాల్సిన యువత వేరే ప్రపంచమని సమర్థించుకుంటూ మత్తు పదార్థాలకు బానిసలైతే భావి తరాల పరిస్థితి ఏమవుతుందో ఆలోచించండి.

**రేవ్ పంజా – కూకటివేళ్లతో పెకలించాలి**

పాశ్చాత్య సంస్కృతి నుంచి వచ్చిన వాయవరుసలు లేని ఈ రేవ్ పార్టీల విష సంస్కృతికి ఎక్కువగా తల్లిదండ్రుల సంరక్షణ సరిగా లేని ధనవంతుల పిల్లలు, సినీ రాజకీయ రంగాల ప్రముఖులు అలవాటు పడుతున్నారు.మనుషులలోని వివేకాన్ని మాయం చేసి జంతువుల సంస్కృతిలోకి తీసుకువెళ్లే ఒక వాతావరణాన్ని సృష్టించేదే ఈ రేవ్ పార్టీ. ఇటువంటి విష సంస్కృతి వ్యాప్తి చెందడం సమాజానికి మంచి సంకేతం కాదు. "రేవ్" విచ్చలవిడి సంస్కృతి సమాజం పై పంజా విసరకముందే దానిని కూకటివేళ్ళతో పెకలించి వెయ్యాలి.

**ననుబోలు రాజశేఖర్,**
**తాడేపల్లిగూడెం,**
**9885739808**

## వికట కవి - వింత పద్యాలు



బాలలు కథలోనికి వెళ్ళేముందు వికటకవి గురించి తెలుకుందాం!

తెనాలి రాముడు పదిహేనవ శతాబ్దపు చివరి భాగంలో తూములూరు లేదా తెనాలి (ప్రస్తుతం తెనాలి మండళంలో ఒక భాగం) అనే గ్రామంలో గార్లపాటి రామకృష్ణగా తెలుగు మాట్లాడే కుటుంబంలో జన్మించాడు . ఇతని తండ్రి గార్లపాటి రాముడు సంతరావురులోని రామలింగేశ్వరునిలో అర్చకునిగా పనిచేశాడు .

రామకృష్ణ చిన్నతనంలోనే గార్లపాటి రాముడు చనిపోయాడు. అతని తల్లి లక్ష్మమ్మ తన సోదరుడితో నివసించడానికి తెనాలిలోని తన స్వగ్రామానికి తిరిగి వచ్చింది. రామకృష్ణ తన మేనమామ ఊరిలో పెరిగాడు కాబట్టి తెనాలి రామకృష్ణగా పిలవబడ్డాడు.

తెనాలి రామకృష్ణ తన చిన్నతనంలో ఎటువంటి అధికారిక విద్యను పొందలేదు, కానీ అతని జ్ఞాన దాహం కారణంగా గొప్ప పండితుడు అయ్యాడు. అతను ఒక ఋషిని కలుసుకున్నాడు, అతను కాళీ దేవిని పూజించమని సలహా ఇచ్చాడు . అతను తన భక్తితో దేవిని ఆవాహన చేసాడు. కాళీమాత అతని ముందు ప్రత్యక్షమై, అతని హాస్యాన్ని మెచ్చుకుని, ఏదో ఒకరోజు విజయనగర చక్రవర్తి కృష్ణదేవరాయలు సామ్రాజ్య ఆస్థానంలో గొప్ప కవిగా కీర్తించబడతాడని దీవించిందని పురాణాలు చెబుతున్నాయి . అతని చమత్కారం మరియు హాస్యానికి ఆకట్టుకున్న దేవత అతనికి "వికటకవి" అనే బిరుదును కూడా ఇచ్చింది.

కృష్ణదేవరాయల ఆస్థానంలో రామకృష్ణ ముఖ్యమైన పదవిలో ఉన్నాడు. అతను అష్టదిగ్గజాలలో ఒకడు మరియు చక్రవర్తిచే నియమించబడిన ముఖ్య సలహాదారు.

కృష్ణదేవరాయల మరణానికి ఒక సంవత్సరం ముందు, 1528లో తెనాలి రామకృష్ణుడు పాముకాటుతో మరణించాడు . రామకృష్ణ చక్రవర్తిని అనేకసార్లు రక్షించడంలో కీలకపాత్ర పోషించారని, క్లిష్టమైన పరిస్థితుల్లో అతనిని రక్షించడంలో కీలకపాత్ర పోషించారని, ఆయన కృష్ణదేవరాయలకు ప్రాణ మిత్రుడని చారిత్రక రికార్డులు పేర్కొంటున్నాయి.

తెనాలి రామకృష్ణుడు

కృష్ణదేవరాయల ఆస్థాన కవిగా ఉన్నప్పుడు మూడు కథా కవితలు ఈ రోజు అందుబాటులో ఉన్నాయి. శైవ గురువు ఉద్భట గురించి ఆయన మొదటి పద్యం, ఉద్భటారాధ్య చరితము, పాలకురికి సోమనాథుని బసవ పురాణం ఆధారంగా రూపొందించబడింది . ఉద్భటారాధ్య చరితము కూడా వారణాసి పవిత్రత గురించి వివరిస్తుంది . శైవ మతం పట్ల తెనాలి రామకృష్ణకు ఉన్న అనుబంధం కారణంగా, ఆయనను తెనాలి రామలింగ కవి అని కూడా పిలుస్తారు.

కథలోనికి ...

వికట కవి అంటే గిట్టనివారు కొందరు నంది తిమ్మన్నను కలసి " ఈఏడు జరిగే వసంతోత్సవ ఉగాది వేడుకలలో తెనాలి రామకృష్ణకు ప్రథమ బహుమతి రాకూడదు అందుకు తమరు రామకృష్ణపై సరైన పద్యం ప్రయోగించి ఓడించాలని మావిన్నపం " అన్నారు. "భగవతేచ్ఛ " అన్నాడు తిమ్మన. ఉగాది రోజు ఉదయం రాయలవారు భువనవిజయం మండపంలో సాహిత్య పోటీలు ప్రారంభించారు. పలువురు ఓటమితో తప్పుకోగా చివరిగా రామకృష్ణ,తిమ్మన మధ్య పోటీప్రారంభం అయింది.

" నాయనా వికటకవి ఈపద్యం ఆలకించు .
ధీరవయనీయవరదీజి
మారవి భానుమత మమత మనుభావిరమా
సారస వననవ సరసా
దారదసమతార హరతామసదరదా . విన్నావా వికటకవి ఈపద్యంలోని ప్రతి వరుసా నీపేరులా ముందు నుండి వెనుకకు ,వెనుక నుండి ముందుకు ఎలా చదివినా ఒకే భావం వస్తుంది . ఇటువంటిదే ఓచక్కని వినసొంపైన పద్యం ఒకటి వినిపించి రాయలవారిని, సభాసదులను రంజింపచేయి "అన్నాడు నంది తిమ్మన. "తల్లి దుర్గాంబ ఆశీస్సులు,రాయలవారి ఆదరణ ఉండగా తప్పకుండా ఇటువంటి పద్యం మరొకటి చెపుతాను ఆలకించండి.
నయసరగ సారవిరయ
తాయానజయసారసుభగధర ధీనియతా
తాయనిరధగభసురజి
సాయజనయతాయరవిరసాగరసయనాజి
ఈపద్యం ప్రారంభం నుండి చివరి వరకు ,చివరినుండి ప్రారంభం వరకు ఎలా చదివినా ఒకే పదాలు వస్తాయి . పద్యంలోని భావం మారదు " అన్నాడు వికటకవి .సభలో కరతాళ ధ్వనులు మిన్నంటాయి.

' రామకృష్ణ కవి అభినందనలు ప్రథమ బహుమతి స్వీకరించండి ' అన్నారు రాయలవారు. వినమ్రంగా చేతులు జోడించాడు వికటకవి.

**బెల్లంకొండ నాగేశ్వరరావు.**
**చెన్నయ్ .**
**9884429899**




## కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నార సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను నెట్ బ్రౌజింగ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com

# మంచి నీటి సమస్యను పరిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ : తంగళ్ళపల్లి రమేష్



ఎల్కతుర్తి జూన్ 21 (ప్రజామంటలు): ఎల్కతుర్తి మండలంలోని జిలుగుల గ్రామంలో 9వ వార్డు ప్రజలు బోరు సమస్య రెండు సంవత్సరాలు నుండి ఉందని చెప్పగానే వెంటనే స్పందించి వెంటనే ఆర్. డబ్ల్యూ.ఎస్. ఏఈకి ఫోన్ చేసి చెప్పి వెంటనే బోర్ మోటారు వేశారు. ఈ సందర్భంగా పొన్నం యువసేన మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తంగళ్ళపల్లి రమేష్ మాట్లాడుతూ.... గత ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబు రెండు సంవత్సరాల నుండి మా గ్రామ సమస్యలు చెప్పిన పట్టించుకోలేదు. ఇప్పటి మంత్రి పొన్నం ప్రభాకర్ విన్న రెండు రోజుల్లోనే బోరు మోటార్ వేయించిన పేద ప్రజల మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి నా హృదయపూర్వకంగా ధన్యవాదములు తెలిపారు. అదే విధంగా గ్రామ ప్రజలు మంత్రి కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొన్నం యువసేన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తంగళ్ళపల్లి రమేష్, తంగళ్ళపల్లి ఐలయ్య, పబ్బు సరోజన, రావుల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సఖి అవగాహన కార్యక్రమము




ఎల్కతుర్తి జూన్ 21 (ప్రజామంటలు): ఎల్కతుర్తి మండలం పెంచికల పేట్ గ్రామ వివో సభ్యుల సమక్షంలో సఖి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సఖి యొక్క ముఖ్య ఉద్దేశాలు మరియు అందించిన సేవలను తెలియజేయుటకు సఖి సెంటర్ కేర్ వర్కర్ హరిత పాల్గొని సఖి సెంటర్ యొక్క ముఖ్య ఉద్దేశాలు మరియు అందించిన సేవలను వివరించడం జరిగింది. ఐదు రకాల సేవలను గురించి తెలుపుతూ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ మరియు మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. కౌన్సిలింగ్ సహాయం వైద్య సహాయం సహాయం పోలీస్ సహాయం తాత్కాలిక వసతి న్యాయ సహాయం ఐదు రకాల సేవలను గురించి తెలుపుతూ చట్టాలపై ప్రతి ఒక్క మహిళలకు అవగాహన ఉండాలని చెప్పడం జరిగింది. సఖి సెంటర్ యొక్క ముఖ్య ఉద్దేశాలు తెలుపుతూ గృహ హింస లైంగిక వేధింపులు పనిచేసే చోట వేధింపులు అత్యాచారాలు ఇలాంటి రక్షణ పొందడానికి సఖి సెంటర్ పనిచేస్తుందని చెప్పడం జరిగింది. సఖి సెంటర్ సిబ్బంది 24 గంటలు పని చేస్తామని సమస్య ఉన్నప్పుడు 181 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయడం ద్వారా తక్షణ సహాయం రక్షణ లభిస్తుందని అదేవిధంగ 08702452112 అనే నెంబర్ కి కాల్ చేయడం ద్వారా సహాయం బాధిత మహిళలకు సహాయం అందించ బడుతుంది అని చెప్పడం జరిగింది.

# ప్రతి పిర్యాదు పట్ల స్పందిస్తాం

**శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు**

**గంజాయి రవాణా, విక్రయాలపై పూర్తిస్థాయిలో నిఘా**

**ఎస్పి అశోక్ కుమార్**



జగిత్యాల జూన్ 21 (ప్రజామంటలు): జిల్లా పరిధిలోని ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటూ చట్ట పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కారం చేస్తూ ప్రజల భద్రత ప్రధాన లక్ష్య%శీ% అని జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ఐపిఎస్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పి మాట్లాడుతూ... జిల్లా పరిధిలోని సామ్యాసుడిని దృష్టిలో పెట్టికోని వారికి భరోసా కలిగించే విధంగా పోలీసింగ్ వుంటుందని, శాంతి భద్రతల విషయంలోను కఠినంగా వుంటామని, ఎవరైన శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని, కఠిన చర్యలు తప్పావు , విద్వేషాలను రెచ్చగోట్టేవారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాము అన్నారు. మహిళలు రక్షణ కోసం పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని ముఖ్యంగా పోకరిలా ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు షీ టీమ్ పనిచేస్తుంది. మహిళల రక్షణకై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. షీ టీం ఫోన్ నెంబర్( 8712670783) తెలిసేలా ఏర్పాటు చేశాం. ఆకతాయిలా వేధింపులపై ఫిర్యాదు చేసేందుకు మహిళలు విద్యార్థినిలు నిర్భయంగా ముందుకు రావాలని సూచించారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తుల కదలికపై పోలీస్ స్టేషన్ల వారీగా నిరంతరగా నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని ఎవరైనా ఒకటి కంటే ఎక్కువ నేరాలకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేస్తాం అన్నారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి రవాణాపై పటిష్ట నిఘ ఏర్పాటు చేయడం జరిగిందని, గంజాయి బారిన పడిన యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన పై దృష్టి సారించాలి అన్నారు. సైబర్ నేరస్తులు కొత్త విధానాలు కొత్త మార్గాలను అనుసరిస్తూ ప్రజలను ఆర్థికంగా మోసం చేస్తున్నారు వాటినీ అరికట్టేందుకు ప్రజలకు సైబర్ నేరాల నియంత్రణకు ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 1930 గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా అన్నారు. జిల్లాలో అనుమతి లేకుండా ఫైనాన్స్ లు నిర్వహించిన ,సామాన్యుల నుంచి అధిక వడ్డీ వసూలు చేసిన చట్టపరమైన చర్యలకు వెళ్తాం. వడ్డీ వ్యాపారులు వేధిస్తే బాధితులు నేరుగా సమీప పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.జిల్లా నుంచి గల్ఫ్ వెళ్ళేవారు నకిలీ ఏజెంట్లకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దు. ఇమ్మిగ్రేషన్, చట్టబద్ధత ఉన్నవారు నుంచి వీసాలు పొందాలి ప్రభుత్వం నిబంధనలు ఉల్లంఘించి గల్ఫ్ మోసాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు చేపడతాం. బాధితుల ఫిర్యాదు చేస్తే తక్షణమే కేసులు నమోదు చేస్తామన్నారు.



**జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఐఏఎస్ ను మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్**

# ఆర్టీసి బస్సు నడుపుతూ గుండెపోటుకు గురైన డ్రైవర్



ఆదిలాబాద్ జూన్ 21 (ప్రజామంటలు): ఆదిలాబాద్ నుండి మహారాష్ట్ర లోని వణికి వెళు ుండగా జైనథ్ మండలం బోరజ్ వద్ద ఆర్టీసీ డ్రైవర్ సిడం అర్జున్ ఒక్కసారిగా గుండెపోటుకు గురైయ్యాడు. ఈ సమయంలో బస్సుకు ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోగా పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది కార్తిక్ సింగ్, సాయి కిరణ్ డ్రైవర్ కు ప్రథమ చికిత్స అందించి రిమ్స్ కు తరలించారు.

# షిరిడీ సాయిబాబా మందిరం 25వ వార్షికోత్సవము



జగిత్యాల జూన్ 21 (ప్రజామంటలు): స్థానిక బైపాస్ రోడ్డు లోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో 25 వ వార్షికోత్సవములో భాగంగా ఈరోజు రుద్ర చండీ హవనం ఘనంగా జరిగింది. ప్రముఖ జ్యోతిష్య వాస్తు పౌరాణిక వేద పండితులు శ్రీ మాన్ నంబి వేణు గోపాల ఆచార్య కౌశిక ప్రత్యక్ష పర్యవేక్షణలో, ప్రముఖ పౌరాణిక వేద పండితులు బ్రహ్మశ్రీ సభాపతి తీగుళ్ళ విషు శర్మ వేదోక్త %శీ%గా హవనం జరిపించారు. ఆలయ అర్చకులు వే నయ్య బృందం వైదిక క్రతువు నిర్వచించారు. ఈ హవనంలో డా. సతీష్ కుమార్, శ్రీలత , మార కైలాసం, రమాదేవి, డా. నాగరాజు, కనక దుర్గ, పవన్, కవిత, కూర్చు న్నారు. ఈ నాటి కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు వొద్దినేని పురుషోత్తమ రావు, రాంకిషణ్ రావు, డా. వి. రాజన్న, మానాల కిషన్, గొల్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, తవుటు, రవిచంద్ర. కిషన్, రాజలింగం, గంగాధర్ మారుతీ రావు భక్తులు, పాల్గొన్నారని, దాదాపు 6 గంటల పాటు ఈ రుద్ర హవనం ఘనంగా జరిగింది



జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల పుణ్యక్షేత్రంలో శ్రీ పార్వతి కోటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

# గాంధీలో జూనియర్ డాక్టర్ల బ్లాక్ డ్రెస్సులు ధరించి నిరసన

## డిమాండ్లు పరిష్కరించాలని ఆందోళన



సికింద్రాబాద్ జూన్ 21 (ప్రజామంటలు): తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కారించాలని కోరుతూ గాంధీ ఆసుపత్రి మెయిన్ బిల్డింగ్ వద్ద శుక్రవారం జూనియర్ డాక్టర్లు బ్లాక్ కలర్ డ్రెస్సులు ధరించి ఆందోళన నిర్వహించారు. గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి క్రమం తప్పకుండా తమకు స్టైఫండ్ లను ఇవ్వాలని, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్ లకు సరైన గౌరవ వేతనం ఇవ్వాలని, తెలంగాణ లో ఏపీ స్టూడెంట్స్ కు 15 శాతం సీట్ల కేటాయింపు రిజర్వేషన్ ను తొలగించాలని కోరారు. పలు ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను చేపట్టాలని, హాస్టల్ సౌకర్యాలు మెరుగుపర్చాలని, ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో మౌళిక వసతి సౌకర్యాలను కల్పించాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. కాలం చెల్లిన ఆసుపత్రి భవనాలను తొలగించి, కొత్తవి నిర్మించాలని కోరారు. తమ డిమాండ్లను ఈనెల 24లోగా పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేపడతామని అన్నారు.

# పోలీస్ విభాగాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్



జగిత్యాల జూన్ 21 (ప్రజామంటలు): జిల్లా ఎస్పీ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారిగా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్ జిల్లా పోలీస్ కార్యాలయంలోని విధులు నిర్వహించే వివిధ పోలీస్ విభాగాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా జిల్లా కార్యాలయములో డి సి ఆర్ బి, ఆర్మ్డ్ రిజర్వ్ విభాగంతో పాటు ఆర్మ్స్ ను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయాల్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది మరియు వారు నిర్వర్తిస్తున్న విధులను జిల్లా ఎస్పీ సంబంధిత అధికారులను అడిగితెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో ఎస్పీ మాట్లాడుతూ.... ఏదైనా సమస్యతో వుంటే ఎప్పుడైనా తనను కలవచ్చు అన్నారు. ఎస్పీ వెంట ఏ ఎస్ పి శివం ఉపాధ్యాయ, ఎస్ బి ఇన్స్పెక్టర్ నాగేశ్వర రావు, ఆర్.ఐ. జానిమియా సిబ్బంది ఉన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

## జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్ లలో యోగా నిర్వహణ



జగిత్యాల జూన్ 21 (ప్రజామంటలు): పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 10 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పి అశోక్ కుమార్ ఐపిఎస్ ఆదేశాలమేరకు స్థానక విరుపాక్షీ గార్డన్ లో, అన్నీ పోలీస్ స్టేషన్ ల పరీదిలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ అదికారులు, సిబ్బంది. ఈ సందర్బంగా డిఎస్పీ మాట్లాడుతూ.... యోగా విద్య ఒక అద్భుతమైన ప్రక్రియగా అభివర్ణిస్తూ, మన భారతావని ప్రపంచానికి అందించిన ఆరోగ్య ఫలం యోగ అని పేర్కొన్నారు. నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవడం వలన ఆరోగ్యంగా జీవించవచ్చని, ఇందులో ఎటువంటి సందేహం లేదని అన్నారు. ఈ కార్యక్రమ0లో డిఎస్పి లు రవీంద్ర కుమార్, రఘు చంధర్, రంగారెడ్డి మరియు డిసి ఆర్ బి, ఎస్ బి, సిసిఎస్, ఇన్స్పెక్టర్ లు శ్రీనివాస్, నాగేశ్వర రావు, లక్ష్మీనారాయణ, మరియు సి.ఐ. లు వేణుగోపాల్, రామ్ నరసింహారెడ్డి, రవి, ఆర్ ఐ లు జానీమియా, రామకృష్ణ, వేణు మరియు ఎస్.ఐ. లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్లో యోగ దినోత్సవం




ఇబ్రహీంపట్నం 21 (ప్రజామంటలు): ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పోలీస్ స్టేషన్లోఅంతర్జాతీయ యోగ దినోత్సవ భాగంగా యోగాసనాలు వేసి వాటి యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా ఎస్సై అనిల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ని కలిసిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు



కరీంనగర్ జూన్ 21 (ప్రజామంటలు): కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బిజెపి ఎం.పి బండి సంజయ్ ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు. శుక్రవారం రోజున కరీంనగర్ లో కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బిజెపి ఎంపి బండి సంజయ్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేసిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.... తొలి సారిగా కరీంనగర్ విచ్చేసిన బండి సంజయ్ గారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, సంయుక్త రాష్ట ఆర్గనైజింగ్ సెక్రెటరీ అలిశెట్టి ఈశ్వరయ్య, బి.సి సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తిరుపురం రాంచందర్, బిసి సంక్షేమ సంఘం పట్టణాధ్యక్షుడు రాపర్తి రవి, బిసి సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు బందెల మల్లయ్య, బి.సి సంక్షేమ సంఘం సారంగాపూర్ మండల అధ్యక్షుడు బాస నాగేందర్, యూత్ కో–ఆర్డినేటర్ హృషికేష్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు నోటు బుక్కుల పంపిణీ

## ప్రగతి ఛారిటబుల్ ట్రస్ట్ వితరణ



సికింద్రాబాద్ జూన్ 21 (ప్రజామంటలు): తెలంగాణ ప్రగతి సేవా సంస్థ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ స్కూల్ లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్కులను ఇవ్వడం అభినందనీయమని ఫతేనగర్ కార్పొరేటర్ పి.సతీష్ గౌడ్, పోలీస్ ఇన్స్పెక్టర్ టి.నర్సింగ్ రావులు అన్నారు. శుక్రవారం ఫతేనగర్ భగత్ సింగ్ గ్రౌండ్ లో నిర్వహించిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రభుత్వ స్కూల్ నిరుపేద విద్యార్థులకు నోట్ బుక్కులను అందచేశారు. గత కొన్నేండ్లుగా తెలంగాణ ప్రగతి సేవా సంస్థ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫౌండర్ ఛైర్మన్ దివంగత వి. పాండు ముదిరాజ్ ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమని వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సనత్ నగర్ సీఐ పురేందర్ రెడ్డి, కూకట్ పల్లి కాంగ్రెస్ ఇంచార్జీ బండి రమేశ్, మేనేజింగ్ ట్రస్టీ యు. చిన్నయ్య, ఛైర్ పర్సన్ వి.శకుంతల, నాయకులు పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్, ఫౌండర్ ట్రస్టీ జి. రాజు, వి. నర్సింహారావు, బిక్షపతి, శ్రీనివాస్, వెంకట్ దాస్, నర్సింగ్ రావు, శ్రీనివాస్ గౌడ్, లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫౌండర్ ఛైర్మన్ వి. పాండు ముదిరాజ్ 9వ వర్ధంతి సందర్భంగా పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు.

# గీతా విద్యాలయంలో ఘనంగా యోగా దినోత్సవం

## పాల్గొన్న డా. బోగ శ్రావణి





జగిత్యాల జూన్ 21 (ప్రజామంటలు): అంతర్జాతీయ యోగా దినోత్సవ" సందర్భంగా జగిత్యాల పట్టణంలోని స్థానిక గీతా విద్యాలయంలో నిర్వహించిన యోగా డే సెలబ్రేషన్ లో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం డా. బోగ శ్రావణి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... యోగా.. మన జీవితంలో ఎన్నో సంవత్సరాల నుంచి భాగమై పోయింది. యోగాసనాల ప్రాధాన్యతని బట్టి మొదటి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 2015 జూన్ 21న నిర్వహించారు. ఆ వేడుకల్లో 84 దేశాల నుంచి వచ్చిన నేతలతో పాటు మొత్తం 35,985 మంది యోగా చేసి రెండు గిన్నిస్ రికార్డులని నెలకొల్పారు. అప్పట్నుంచి ప్రతి సంవత్సరం జూన్ 21న యోగా దినోత్సవాన్ని సెలబ్రేట్ చేసుకుంటున్నారు. ఇలా ప్రతి సంవత్సరం జూన్ 21న యోగా దినోత్సవాన్ని సెలబ్రేట్ చేసుకుంటున్నారు. యోగా అనేది మన జీవితంలో భాగమైతే కచ్చితంగా ఆరోగ్యంగా ఉంటాం. పురాతన కాలం నుంచి యోగా ని ఆచరించేవారు. ఈ యోగాసనాలు గొప్పదనం తెలుసు కాబట్టే, విదేశీయులు సైతం యోగాసనాలను ఆచరిస్తున్నారు. రెగ్యులర్‌గా ఆసనాలు వేయడం వల్ల చాలా సమస్యలు దూరమవుతాయి. బాడీ ఫ్లెక్సిబిల్‌గా ఉంటుంది. దీంతో పాటు యోగాని మన జీవితంలో భాగం చేసుకుంటే ఒత్తిడి, ఆందోళనలను తగ్గుతాయి. మనకి వచ్చే చాలా ఆరోగ్య సమస్యలకి యోగా లో పరిష్కారాలు ఉన్నాయి. ఎంతో మంది వీటి గొప్పదనం తెలుసు కాబట్టే రోజూ యోగాసనాలు వేస్తున్నారు. దీంతో యోగా ఖ్యాతీ ప్రపంచంలోని నలుదిక్కులకి పాకింది. సూర్య నమస్కారాలు యోగాలో ముఖ్యమైన ఆసనం. ఈ సూర్య నమస్కారాలు 12 ఆసనాల కలయికగా ఉంటుంది. దీనిని చేయడం వల్ల చాలా వరకూ బెనిఫిట్స్ ఉంటాయి. యోగాని చేయడం వల్ల మనసుకి, శరీరానికి ప్రశాంతత ఉంటుంది. మొదట్లో ఎంతతో ప్రాచూర్యం పొందిన యోగా మధ్యలో కొన్ని రోజులు దాని ప్రభావం తగ్గింది. అయితే, యోగాసనాల ప్రయోజనాల కారణంగా పెరిగిన అవగాహనతో నేడు మళ్ళీ యోగాకి పూర్వ వైభవం వచ్చింది. దీంతో పాటు ప్రతి ఒక్కరూ యోగాని తమ జీవనంలో భాగం చేసుకుంటున్నారు. ఇంతటి ప్రాముఖ్యత ఉంది కాబట్టే, యోగాకి ప్రత్యేకంగా ఓ రోజుని అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అనుమల్ల కృష్ణ హరి,జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు కొక్కు గంగాధర్, జిల్లా కార్యాలయ కార్యదర్శి జుంబర్తి దివాకర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సిరికొండ రాజన్న, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, ఉపాధ్యక్షులు పవన్ సింగ్, గదాసు రాజేందర్, మ్యాదరి అశోక్, రాపర్తి రాజ్ కుమార్, మామిడాల రాజగోపాల్, గడ్డల లక్ష్మి, సింగం పద్మ, మామిడాల కవిత మరియు బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఫీజులు దోపిడీ చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

### బిఆర్ఎస్వి నాయకులు రాపర్తి అఖిల్



జమ్మికుంట జూన్ 21 (ప్రజామంటలు):

జమ్మికుంట పట్టణంలోని ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం జిల్లా నాయకులు రాపర్తి అఖిల్ అన్నారు. ఈరోజు ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని స్థానిక మండల విద్యాధికారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ.... పట్టణంలోని ప్రైవేటు స్కూల్లలో విద్యార్థుల దగ్గర నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు. మరియు అదే విధముగా వారు చెప్పిన బుక్ స్టాల్ లోనే నోట్ బుక్స్ కొనుగోలు చేయాలన విద్యార్థులను ఇబ్బందులు పెట్టుచున్నారు. ఉదాహరణకు 6వ తరగతి విద్యార్థికి నోట్ బుక్స్ ఖర్చు రూ.7,500 తీసుకుంటున్నారు. అవే నోట్ బుక్స్ బయట బుక్ స్టాల్స్ లో తీసుకుంటే సగం ధరకే వస్తాయి. అలాగే యు.కె.జి. విద్యార్థికి ట్యూషన్ ఫీజు రూ.46,000 లు తీసుకుంటున్నారు. వ్యాన్ వెళ్లే పిల్లలకు నెలకు రూ.6,000 ల వరకు వసూలు చేస్తున్నారు. ఈ స్థాయిలో ఫీజులు తీసుకోవడం వల్ల మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి కుటుంబాలకు పెను భారము అవుతుంది. అంతే కాకుండా టర్మ్ ఫీజులని, యూనిట్ ఫీజులని కొన్ని స్కూల్స్ డెవలప్మెంటు ఫీజులని వారికి ఇష్టం వచ్చినట్లుగా విద్యార్థుల వద్ద నుండి వసూలు చేస్తున్నారు.జీవో నెంబర్ 91 ప్రకారం ఈ టెక్నోల పేరుతో స్కూళ్లలో ఫీజులు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆయా ప్రాంతాల్లో ఆర్థిక స్థితిగతులను తెలుసుకొని ఫీజులు 10,000 రూపాయలుగా నిర్ణయించాలని ప్రభుత్వం చెబుతుంది ఆయన కూడా ప్రైవేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తూ విద్యార్థుల నుండి అధికంగా వసూలు చేస్తున్నారు ఇలాంటి విద్యా సంస్థలను ఆకస్మికంగా తనిఖీలు చేసి మూసివేసే విధంగా చూడాలని తమరికి విజ్ఞప్తి చేస్తున్నాము. ఈ విధంగా అన్యాయంగా ఫీజులు మరియు అవసరం లేకున్న నోట్ బుక్స్ ఎక్కువ ధరకు కొనుగోలు చేయించటం వల్ల విద్యార్థులను ప్రైవేయిట్ స్కూళ్లలో చదివించటం పట్టణంలో మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుచున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం , విద్యాధికారులు జమ్మికుంట పట్టణంలోని అన్ని పాఠశాలలను తనిఖీలు చేసి వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము. లేనిచో భారత రాష్ట్ర విద్యార్థి విభాగం తరుపున తీవ్రమైన ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నాము. ఈ కార్యక్రమంలో సిలివేరు విజయ్, శ్రీనాథ్, భోగం అఖిల్, రాజకుమార్, అభినయ్, సాక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాలలో యోగ దినోత్సవం



గొల్లపల్లి జూన్ 21 (ప్రజామంటలు):

ఆదర్శ పాఠశాలలో అంత ర్జాతీయ దినోత్సవ భాగంగా విద్యార్థిని విద్యార్థులకు యోగాసనాలు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. యోగ ప్రపంచానికి భారతదేశ నా బహుమతి అని పాఠశాల ప్రిన్సిపల్ ఈరవేణి రాజకుమార్ అన్నారు. పాఠశాల వ్యాయామం ఉపాధ్యాయులు విద్యార్థినీలు ఆసనాలు, ప్రాణాయమం చేయించి వాటి ప్రాముఖ్యత గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజకుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె. నగేష్, ఉపాధ్యాయులు అరుణ్, రాజేశ్వరి, సంధ్యారాణి, రమాదేవి, రాజేశ్వరి వ్యాయామ ఉపాధ్యాయులు కే. రజిత, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## జువ్వాడి కృష్ణారావు జన్మదిన వేడుకలు






ఇబ్రహీంపట్నం జూన్ 21 (ప్రజామంటలు):

ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు జన్మదిన వేడుకలు ఇబ్రహీంపట్నం మండల పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎస్సి సెల్ అధ్యక్షులు దూదిగం గంగాధర్, బీసీ సెల్ అధ్యక్షులు బుస రాజేశ్వర్, తిమ్మాపూర్ సింగిల్ విండో చైర్మన్ బాస శ్రావణ్, జిల్లా యూత్ ఉపాధ్యక్షులు కాస సంజీవ్, షోషల్ మీడియా కో కన్వీనర్ కట్ట మనోజ్ యాదవ్, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రమేష్, అశోక్, తిరుపతిరెడ్డి, బండి రాజేష్, రెబ్బటి రాజశేఖర్, రాజేషుని రవి, మాహిపాల్, కొమ్ముల మోహన్ రెడ్డి, సాయన్న, రమేష్ లు పాల్గొన్నారు.

## గాంధీలో రిటైర్డ్ ఎంప్లాయి మిస్సింగ్



సికింద్రాబాద్ జూన్ 21 (ప్రజామంటలు):

గాంధీ ఆసుపత్రిలో ఓ రిటైర్డ్ ఎంప్లాయి మిస్సింగ్ అయిన ఘటన వెలుగు చూసింది. చిలకలగూడ ఎస్.ఐ పి.కిషోర్ కథనం ప్రకారం...సిటీలోని రాజేందర్ నగర్ కు చెందిన రిటైర్డ్ ఎంప్లాయి ఎం. నర్సింగ్ రావు (60) ఈనెల 15న తన సోదరుడు నవీన్ వైద్య పరీక్షల కోసం భార్య సులోచనతో కలసి గాంధీ ఆసుపత్రికి వచ్చాడు. అయితే ఉన్నట్టుండి ఓపీ బ్లాక్ వద్ద కూర్చుని ఉన్న నర్సింగ్ రావు అదృశ్యం అయ్యాడు. అతడి మొబైల్ కు కాల్ చేయగా, స్విచ్ఛాఫ్ రావడంతో ఫ్యామిలీ మెంబర్స్ తమకు తెలిసిన అన్ని చోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. చివరికి చిలకలగూడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఫోటోలోని వ్యక్తిని గుర్తు పట్టిన వారు తమకు సమాచారం ఇవ్వాలని ఎస్.ఐ. కోరారు.

## యోగా ప్రతి రోజూ చేయాలి

### సీనియర్ సివిల్ జడ్జ్ కె. ప్రసాద్





మెట్టుపల్లి జూన్ 21 (ప్రజామంటలు):

యోగా అనేది ప్రత్యేక దినాలలో కాకుండా, ప్రతిరోజు చేయాల్సిన శారీరక, మానసిక వ్యాయామం అని మెట్ పల్లి సీనియర్ సివిల్ కోర్టు ఇంచార్జి జడ్జ్ కె. ప్రసాద్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మెట్ పల్లి కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒక్కోరోజో, రెండు రోజుల్లో యోగా చేస్తే లాభం ఉండదని, సంపూర్ణ ఆరోగ్యం కోసం యోగని నిత్యసాధనలా చేయాలన్నారు. వివిధ రకాల యోగా ఆసనాల్ని యోగా గురూజీ ఎనగందుల హన్మాండ్లు మరియు న్యాయవాది బద్దం లక్ష్మారెడ్డి లు న్యాయవాదుల చేత సాధన చేయించారు. అనంతరం యోగా గురూజీ హన్మాండ్లు ని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ప్రధాన కార్యదర్శి తునికి వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శి రాంపల్లి జగన్, సీనియర్ న్యాయవాదులు వడ్డేపల్లి శ్రీనివాసన్, ఏలేటి నరేందర్ రెడ్డి, మగ్గిడి వెంకట నర్సయ్య, కంతి మోహన్ రెడ్డి, పుప్పాల భానుమూర్తి, తోగిటి రాజశేఖర్, అబ్దుల్ హాఫీజ్, ఓగులపు శేఖర్, మన్నె గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీలో ముగిసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య పోస్టుమార్టం



సికింద్రాబాద్ జూన్ 21 (ప్రజామంటలు):

చొప్పదండి కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సతీమణి రూపాదేవి డెడ్ బాడీకి శుక్రవారం ఉదయం గాంధీ ఆసుపత్రి మార్చురీలో డాక్టర్లు పోస్టు మార్టం నిర్వహించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూపాదేవి గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. ఈసందర్భంగా జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాంధీ ఆసుపత్రికి చేరుకొని డాక్టర్లతో మాట్లాడారు. పోస్టుమార్టం అయ్యే వరకు మార్చురీ వద్దనే వెయిట్ చేశారు.

**డాక్టర్లతో మంత్రి భేటి:**

ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. రాజారావును ఆసుపత్రిలో పేషంట్ల సౌకర్యాలు, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో చెత్తా, చెదారం లేకుండా శుభ్రంగా ఉండటం, చెట్లతో పచ్చదనం నిండి ఉండటంతో మంత్రి మెచ్చుకున్నారు.

## కేంద్ర మంత్రులకు ఘన స్వాగతం పలికిన బీజేపీ శ్రేణులు



సికింద్రాబాద్ జూన్ 21 (ప్రజామంటలు):

కేంద్ర మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటి సారిగా హైదరాబాద్ కు చేరుకున్న మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ లకు సిటీకి చెందిన బీజేపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. బేగం పేట ఏయిర్ పోర్టు వద్ద బేగంపేట బీజేపీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ ముదిరాజ్, బీజేవైఎం అధ్యక్షులు వేణు గణేశ్ ల అధ్వర్యంలో కార్యకర్తలు వారికి గజమాలతో సన్మానించారు. ఈసందర్భంగా మోదీ జిందాబాద్, బీజేపీ జిందాబాద్... జై శ్రీరామ్... నినాదాలతో రహదారి అంతా మారుమోగింది. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పొట్లకాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్, శ్రావణ్, సంధ్య, లక్ష్మీ, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### మండల పరిషత్ కార్యాలయంలో

## అంతర్జాతీయ యోగా దినోత్సవం



మహాదేవపూర్ జూన్ 21 (ప్రజామంటలు):

మండల కేంద్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించు కొని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో లో యోగా దినోత్సవం నిర్వహించారు కార్యక్రమమును ఉద్దేశించి జడ్పీటీసీ గూడల అరుణ మాట్లాడుతూ.... యోగ అనేది కేవలం శారీరిక వ్యాయామం మాత్రమే కాదు మానసిక మరియు ఆధ్యాత్మిక సాధన అని, యోగా సాధన వలన శారీరక మానసిక ఆధ్యాత్మిక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని వీటిపై అవగాహన పెంచుకోవడం కోసమే ప్రతి ఒక్కరూ ప్రపంచ యోగా దినోత్సవం జరుపుకోవాలని సూచించినారు. యోగా అంటే కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదని శ్వాస వ్యాయామాలతో కూడుకొని మనుషులలో ఉన్నటువంటి ఒత్తిడిని ఆందోళనను తగ్గించి వారిని నిరాశ నిస్పృహల నుండి బయటకు తీసుకరావడానికి ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ప్రతి ఒక్కరికి యోగా అనేది అవసరమని ప్రతిరోజు ఉదయం వేళలో యోగా సాధనకు సమయాన్ని కేటాయించి యోగా సాధన చేసినచో ప్రతి ఒక్కరి యొక్క ఆరోగ్యం మెరుగుపడుతుందని ప్రతి ఒక్కరికి యోగా అనేది ఉపయోగకరమని తెలిపినారు. కార్యక్రమంలో ఎంపీపీ రాణి బాయ్, కే. వెంకటేశ్వర్లు ఎంపీడీవో, కే. రమేష్ ఉపాధి హామీ ఏపీవో, రవీందర్ ఐకెపి ఎపిఎం, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఉపాధి హామీ సిబ్బంది రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు తదితరులు పాల్గొన్నారు.

## చిగురుమామిడిలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి


### పాఠ్యపుస్తకాలలో జయశంకర్ సార్ చరిత్రను చేర్పించాలన్న శ్రీరామోజు రాజ్ కుమార్



చిగురుమామిడి జూన్ 21 (ప్రజామంటలు):

తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ సార్ 13వ వర్ధంతిని చిగురుమామిడి మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా వద్ద విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ సార్ చిత్రపటానికి విశ్వకర్మ నాయకులు పలు కుల సంఘాల నాయకులు పూలమాలు వేసి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్ మాట్లాడుతూ ఆచార్య జయశంకర్ సార్ చిన్నతనం నుండి అభ్యుదయ భావాలు కలిగి ఉన్నతమైన విద్యలలో ఆరితేరిన వాడై 1952 నుండి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకై ఎన్నో వ్యూహరచనలు గావించి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా వారి ఉపన్యాసాలతో తెలంగాణ నాయకులకు, ప్రజానీకానికి ఉద్యమ స్ఫూర్తిని నింపి అందరిని తెలంగాణ పోరాట బాట వైపు నడిపించారు జాతి మనగడకై వైవాహిక బంధాన్ని కూడా త్యాగం చేసి అహర్నిశలు పాటుపడ్డ నాయకుడైన జయశంకర్ గారిని ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా తగిన గుర్తింపు ఇవ్వలేదు ప్రభుత్వం ఇకనైనా స్పందించి ప్రతి మండల కేంద్రంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడమే కాకుండా పాఠ్యపుస్తకాలలో ఆయన జీవిత చరిత్రను చేర్పించి భావితరాలకు ఆయన ఆలోచన విధానాలను పోరాట పటిమను అందియాలన్నరు.ఇట్టి కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి సదాచారి విశ్వబ్రాహ్మణ ముఖ్య బాధ్యులు అనువోజు బాలకృష్ణ ఆచారి, దంచనోజు సదానందచారి, కందుకూరి శ్రీనివాస్, చిగురుమామిడి గ్రామ అధ్యక్షులు పోలోజు సదాచారి, సుందరగిరి అధ్యక్షులు రాంపెల్లి వెంకటచారి సంఘ బాధ్యులు అనువోజు చిరంజీవి, గొల్లపెల్లి తిరుపతి, వెంకన్న, శ్రీనివాస్, రాజయ్య, పెనుకుల తిరుపతి, వెంకన్న, సత్తయ్య, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం



గొల్లపల్లి జూన్ 21 (ప్రజామంటలు): గొల్లపల్లి మండల సెక్టార్లో అంగన్వాడీ కేంద్రాలలో అంతర్జాతీయ యోగా డే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శారీరక మానసిక సామర్థ్యాలను కలిగి ఉంటారని ప్రతిరోజు ఉదయము, సాయంత్రము యోగా చేయడం వలన శారీరక మానసికంగా ఆరోగ్యంగా వుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ ఆశా వర్కర్స్, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## క్రీడా సౌకర్యాల అభివృద్ధి పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ డిప్యూటీ డైరెక్టర్






హనుమకొండ జూన్ 21 (ప్రజామంటలు):

తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ డిప్యూటీ డైరెక్టర్ చంద్రారెడ్డి శుక్రవారం రోజున జిల్లాలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ను పాలనలో భాగంగా సందర్శించారు. అనంతరం డివై ఎస్ ఓ గుగులోత్ అశోక్ కుమార్, మరియు డి ఎస్ ఏ మరియు రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్ కోచులతో సమావేశం నిర్వహించి స్పోర్ట్స్ డెవలప్మెంట్ గురించి చర్చించి పర్ఫామెన్స్ అడిగి తెలుసుకున్నారు. తదనంతరం స్విమ్మింగ్ పూల్ ని సందర్శించి మెయింటెనెన్స్ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

## ఎన్.టి.ఎ. ను ప్రక్షాళన చేయాలి

### బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్



కరీంనగర్ జూన్ 21 (ప్రజామంటలు):

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నీట్ మరియు నెట్ నిర్వహించడంలో విఫలం అయిన అవినీతి అసమర్థ ఎన్.టి.ఎ. సంస్థ ను ప్రక్షాళన చేయాలని బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేశారు. ఈ సందర్భగా భాగ్యనగర్ లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ మాట్లాడుతూ.... దేశంలో ప్రతిష్టాత్మక పరీక్షలైన నీట్ మరియు నెట్ పరీక్షలలో నెలకొన్న అవకతవకలపై సిబిఐ చే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి నెట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు గుర్తించడానికి సిబిఐ విచారణకు ఆదేశించటాన్ని బీసీ సంక్షేమ సంఘం స్వాగతిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో తాడూరి కృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మచ్చలేని శ్రీధర్ బాబుపై అసత్య ఆరోపణలు సరికాదు



మహాదేవపూర్ జూన్ 21 (ప్రజామంటలు):

కాళేశ్వరం ఎస్సై పాల్పడిన దురదృష్టకర సంఘటనను మచ్చలేని మంత్రి శ్రీధర్ బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబు లకు ఆపాదిస్తూ పుట్ట మధు చేసిన ఆరోపణలను ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. శ్రీను బాబు ముడుపులు తీసుకుని కాళేశ్వరం ఎస్సై గా అత్యాచారాల చరిత్ర ఉన్న భవాని సేన్ నియామకం చేయించారని, పోలీస్ స్టేషన్లను క్లబ్బులుగా మార్చారని పుట్ట మధు ఆరోపించడాన్ని తప్పు పట్టారు. బిఆర్ఎస్ హయాంలోనే అత్యాచారానికి పాల్పడిన చరిత్ర కలిగిన భవాని సేన్ ను మహాదేవపూర్ రెండవ ఎస్సైగా పుట్ట మధు నియమించాడని విమర్శించారు. ఏదో ఒక సంఘటన జరగగానే రాజకీయంగా లబ్ధి పొందాలనే ఉద్దేశంతో వ్యక్తిగత ఆరోపణలు చేయడం మానుకోవాలని వీరు డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మారేడుపల్లి సిఐ నాగేశ్వరరావు ఒక మహిళను బెదిరించి అత్యాచారం చేసిన సంఘటనను సిట్ నియమించి రోజులకొద్దీ తాత్సారం చేసి చివరకు సస్పెండ్తో సరిపెట్టారని అదే ప్రస్తుత కాళేశ్వరం సంఘటనలో మంత్రి శ్రీధర్ బాబు ప్రమేయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గంటల వ్యవధిలో స్పందించి ఎస్సై ని ఉద్యోగం నుంచి తొలగించారని పేర్కొన్నారు. బిఆర్ఎస్ హయాంలో నియమితులైన డి.ఎస్.పి, కాటారం ఎస్సై లాంటి అనేకమంది అధికారులను మార్చలేదు సరికదా మంచి చేసే అధికారులను మంత్రి నిష్పక్షపాతంగా ప్రజలకు సేవ చేయాలని, అభివృద్ధి సాధించాలని కోరుకుంటున్నారన్నారు. అభివృద్ధి చేయలేదనటం, ఎస్సీ ఎస్టీ బీసీలకు వ్యతిరేకమని విమర్శించడానికి సమాధానం ఇస్తూ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగానే మంథని నియోజకవర్గంలో 300 కోట్లతో సీసీ రోడ్లు వేయించారని, మంథని కాటారం రహదారిని నిర్మించే పనులు జరుగుతున్నాయని, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. పుట్ట మధు వెంట పిడికెడు మంది బీసీ, ఎస్టీ, ఎస్సీ లు ఉండగా శ్రీధర్ బాబు వెంట వేలాది మంది ఉన్నారని గుర్తుపెట్టుకోవాలని అన్నారు. మహాదేవపూర్ జెడ్పిటిసి యోగలో భాగమైన ఏరోబిక్స్ ను చూపించారే తప్ప అధికార బలం సమస్య ఉత్పన్నం కాలేదని సమర్థించుకున్నారు. రాష్ట్రంలో ఫోన్ టాపింగ్ చేసి, పోలీస్ అధికారులను ఇష్టారీతిన వాడుకున్న టిఆర్ఎస్ ప్రభుత్వం తుడుచుకు పోయిందని, మంథని నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికలలో 52,000 మెజారిటీ ఇచ్చి శ్రీధర్ బాబును ఆశీర్వదించారన్నారు. వ్యక్తిగత దూషణలకు, కుయుక్తులకు పాల్పడుతూ శ్రీధర్ బాబు ప్రతిష్టను దిగజారిస్తే సహించేది లేదని ధ్వజమెత్తారు. విలేకరుల సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కోట రాజబాబు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎండి అక్బర్ ఖాన్, ఎంపీపీ రాణి బాయి, జడ్పిటిసి గుడాల అరుణ, సింగిల్ విండో చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి, పలిమెల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుండెబోయిన చిన్నన్న,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎర్రవెల్లి విలాసరావు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కటకం అశోక్, ఎంపీటీసీలు ఆకుతోట సుధాకర్, రేవెల్లి మమత, మైనారిటీ నాయకులు అస్రార్ ఖురేషి, నయూముద్దీన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎనమంద్ర వామన్ రావు, కలికోట వరప్రసాద్, అయిత తిరుపతిరెడ్డి, నల్లబూగ ధర్మయ్య, లింగాల సమ్మయ్య, జిల్లెల నాగరాజు, రంజిత్ రెడ్డి, గడ్డం స్వామి మండల గ్రామస్థాయి కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్ కి ఘన స్వాగతం పలికిన బిజెపి నాయకులు





ఇల్లందకుంట జూన్ 21 (ప్రజామంటలు) కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి ఇల్లందకుంట మండలానికి చేరుకున్న బండి సంజయ్ కి ఘన స్వాగతం పలికిన బిజెపి నాయకులు అలాగే శ్రీ సితా రామ చంద్ర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# కేజ్రీవాల్ బెయిల్ ఉత్తర్వులపై స్టే

## - ట్రయల్ కోర్టు ఉత్తర్వులను నిలిపివేసిన ఢిల్లీ హైకోర్టు

దిల్లీ (ప్రజా మంటలు):



మద్యం విధానానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు మళ్లీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో ఆయనకు సాధారణ బెయిల్ మంజూరుచేస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను దిల్లీ హైకోర్టు నిలిపివేసింది. కేజ్రీవాల్ బెయిల్‌ను వ్యతిరేకిస్తూ ఈడీ పిటిషన్ వేసిన నేపథ్యంలో న్యాయస్థానం ఈ ఆదేశాలిచ్చింది. మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్ కు గురువారం సాయంత్రం రెగ్యులర్ బెయిల్ లభించింది. రూ.లక్ష వ్యక్తిగత బాండు సమర్పించిన తర్వాత ఆయన్ని విడుదల చేయవచ్చని న్యాయమూర్తి ఆదేశించారు. విచారణకు ఆటంకం కలిగించరాదని, సాక్షుల్ని ప్రభావితం చేయకూడదని కేజ్రీవాల్‌పై ఆంక్షలు విధించారు. ఎప్పుడు అవసరమైతే అప్పుడు కోర్టుకు హాజరై విచారణకు సహకరించాలని ఆదేశించారు. ఈ తీర్పుపై పైకోర్టులో అప్పీలు దాఖలు చేయడానికి వీలుగా దానిని 48 గంటలపాటు పక్కనపెట్టాలని ఈడీ చేసిన వినతిని ట్రయల్ కోర్టు తిరస్కరించింది. ఈ క్రమంలోనే నేడు ఆయన జైలు నుంచి విడుదల కావాల్సిఉండగా.. ఈడీ హైకోర్టును ఆశ్రయించింది. ట్రయల్ కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ దర్యాప్తు సంస్థ పిటిషన్ దాఖలు చేసింది. "బెయిల్‌ను వ్యతిరేకించేందుకు మాకు సరైన అవకాశం లభించలేదు. వెకేషన్ మా వాదనలను వినిపించేందుకు సరిపడా సమయం ఇవ్వలేదు" అని ఈడీ తరఫు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ట్రయల్ కోర్టు ఉత్తర్వులపై స్టే విధించి, తమ పిటిషన్‌పై అత్యవసర చర్యలు చేపట్టాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన హైకోర్టు.. దీనిపై శుక్రవారమే విచారణ జరుపుతామని వెల్లడించింది. అప్పటివరకు ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్ ఉత్తర్వులను అమలుచేయొద్దని ఆదేశాలు జారీ చేసింది. దీంతో కేజ్రీవాల్ ప్రస్తుతానికి జైలు నుంచి విడుదలయ్యే అవకాశం లేకుండా పోయింది.

## కెనడా పార్లమెంట్‌లో నిజ్జర్‌కు సంతాపం.. వ్యతిరేకించిన భారత్

దిల్లీ (ప్రజా మంటలు):

భారత్‌తో కొనసాగుతోన్న దౌత్యపరమైన విభేదాలకు ఇటీవల కెనడా మరింత ఆజ్యం పోసిన సంగతి తెలిసిందే. హత్యకు గురైన ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్‌కు పార్లమెంట్ వేదికగా సంతాపం ప్రకటించింది. దీనిపై తాజాగా భారత ప్రభుత్వం స్పందించింది. "వేర్పాటువాదాన్ని, హింసను సమర్థించే రాజకీయాలకు చోటు కల్పించే చర్యలను మేం సాధారణంగానే వ్యతిరేకిస్తాం" అని స్పష్టం చేసింది. 2023 జూన్ 18న బ్రిటిష్ కొలంబియాలోని సర్రే ప్రాంతంలో ఓ గురుద్వారా వెలుపల నిజ్జర్ హత్య జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటన వెనక భారత ఏజెంట్ల పాత్ర ఉందంటూ ట్రూడో చేసిన ఆరోపణలతో రెండు దేశాల మధ్య విభేదాలు నెలకొన్నాయి. ట్రూడో ఆరోపణలను భారత్ (ఎనిటతిజీ) ఖండించింది. నిజ్జర్ హత్యకు గురై ఏడాదైన సందర్భంగా ట్రూడో సర్కారు అతడికి ప్రత్యేకంగా నివాళులర్పించడం గమనార్హం. ఏకంగా దేశ పార్లమెంట్‌లో ఈ సంతాప కార్యక్రమం నిర్వహించింది. ఎంపీలంతా లేచి నిలబడి మౌనం పాటించారు. "ఓ దేశం ఉగ్రవాదిగా ప్రకటించిన, ఇంటర్‌పోల్ వాంటెడ్ జాబితాలో ఉన్న వ్యక్తి హత్యకు దేశ పార్లమెంట్‌లో అంజలి ఘటించడం ప్రపంచంలోనే ఇదే తొలిసారి" అంటూ కొందరు నెటిజన్లు మండిపడ్డారు. మరోవైపు వాంకోవర్‌లోని భారత రాయబార కార్యాలయం దీనికి తగిన కౌంటర్ కూడా ఇచ్చింది. ఎయిరిండియా కనిష్క విమానాన్ని గాల్లో పేల్చివేసి జూన్ 23 నాటికి 39 సంవత్సరాలు. సిక్కు వేర్పాటువాదులు పెట్టిన బాంబుకి ఆ విమానం తునాతునకలు కావడంతో 329 మంది మృతి చెందారు. ఆ రోజున వాంకోవర్‌లోని స్టాన్లీ పార్క్ వద్ద సెపెర్లీ ప్లేగ్రౌండ్‌లో ఉన్న ఎయిరిండియా మెమోరియల్ వద్ద సంతాప కార్యక్రమం నిర్వహించనున్నట్టు దౌత్య కార్యాలయం ప్రకటించిన సంగతి తెలిసిందే.

# రాజ్యసభా పక్ష నేతగా జేపీ నడ్డా?

దిల్లీ (ప్రజా మంటలు):

కేంద్రమంత్రి జేపీ నడ్డా రాజ్యసభా పక్షనేతగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతం నడ్డా భాజపా జాతీయ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఆయన పదవీ కాలం ఈ నెలతో ముగుస్తుండడంతో.. ఏడాది చివర్లో జరగనున్న నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకూ పార్టీ అధ్యక్షుడిగా కొనసాగాలని అధిష్ఠానం కోరినట్లుగా సమాచారం. అన్ని రాష్ట్రాల్లో సంస్థాగత ఎన్నికలు 50 శాతం పూర్తయిన తర్వాతే కొత్త జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకుంటారని పార్టీ నిబంధనలు చెబుతున్నాయి. డిసెంబర్–జనవరిలో ఈ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో భాజపా అధ్యక్షుడిగా ఉన్న అమిత్ షా.. కేంద్ర హోంశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అప్పుడు వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నడ్డా.. జనవరి 2020లో పూర్తిస్థాయి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. తాజాగా ఆయన కేంద్ర మంత్రివర్గంలో చేరారు.

## నూతన క్రిమినల్ అమలును వాయిదా వేయండి..

### - ప్రధాని మోదీకి మమతాబెనర్జి లేఖ

కోల్‌కతా(ప్రజా మంటలు):

బీజేపీ సర్కారు అమల్లోకి తీసుకురాబోతున్న మూడు నూతన క్రిమినల్ చట్టాలపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జి ప్రధాని నరేంద్రమోదీకి లేఖ రాశారు. ఆ మూడు కొత్త క్రిమినల్ చట్టాల అమలును వాయిదా వేయాలని లేఖలో కోరారు. బీజేపీ ప్రభుత్వం తెచ్చిన మూడు కొత్త క్రిమినల్ చట్టాలు ఈ జూలై ఒకటో తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. ఈ నేపథ్యంలోనే మమతాబెనర్జి ప్రధానికి లేఖ రాశారు. కొత్తగా రూపొందించిన క్రిమినల్ చట్టాలను వాయిదా వేయడంవల్ల వీటిపై పార్లమెంటులో సమీక్ష జరిపే అవకాశం ఉంటుందని మమతాబెనర్జి పేర్కొన్నారు. కాగా, బ్రిటిష్‌కాలం నాటి ఇండియన్ పీనల్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 చట్టాల స్థానంలో.. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్షా సంహిత, భారతీయ సాక్ష్యా చట్టాలను బీజేపీ రూపొందించింది.

# ఉక్రెయిన్‌కు మద్ధతిస్తే అంతే..

## - దక్షిణ కొరియాకు పుతిన్ వార్నింగ్

మాస్కో (ప్రజా మంటలు):

దక్షిణ కొరియాకు పుతిన్ వార్నింగ్ ఇచ్చారు. రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఒకవేళ ఉక్రెయిన్‌కు దక్షిణ కొరియా మద్దతు ఇస్తే అది పెద్ద తప్పు అవుతుందని పుతిన్ తెలిపారు. రష్యా, ఉత్తర కొరియా మధ్య స్నేహం కుదరడంతో.. ఇటీవల దక్షిణ కొరియా ఈ అంశంపై మాట్లాడినట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేయాలని దక్షిణ కొరియా నిర్ణయిస్తే, అప్పుడు తాము తీసుకోబోయే నిర్ణయాలు కొరియాను ఇబ్బంది పెడుతాయని పుతిన్ తెలిపారు. అమెరికా, దాని మిత్రదేశాలు ఒకవేళ ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా కొనసాగిస్తే అప్పుడు తాము ఉత్తర కొరియాకు ఆయుధాలు సరఫరా చేయనున్నట్లు చెప్పారు.

# పోచారం ఇంటిముందు ఆందోళన

## 11మంది బిఆర్ఎస్ నేతలపై కేసులు

హైదరాబాద్,జూన్21 (ప్రజా మంటలు):

హైదరాబాద్‌లో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి నివాసానికి వెళ్లి, ఇంటిముందు ధర్నకు దిగిన బీఆర్ఎస్ నాయకులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో పాటు మరో 11 మందిపై ఐపీసీ 353, 448 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాల్క సుమన్‌తో పాటు 11 మందిని పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. బీఆర్ఎస్ నాయకులను కోర్టుకు తరలిస్తున్న సమయంలో బంజారాహిల్స్ పీఎస్ ఎదుట బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. బీఆర్ఎస్ ఉద్యమ నాయకులను వెంటనే విడుదల చెయ్యాలని ఎఫ్డీసీ మాజీ చైర్మన్ ఎఫ్డీసీ అనిల్ కూర్మాచలం డిమాండ్ చేశారు. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని కలుసుకోవడానికి వారి ఇంటికి వెళ్లిన బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ నాయకులని అక్రమంగా అరెస్ట్ చెయ్యడాన్ని తీవ్రంగా ఖండి స్తున్నామన్నారు.

## జిల్లాలో 228 కిలోల గంజాయి పట్టివేత

భద్రాద్రి కొత్తగూడెం,జూన్21 (ప్రజా మంటలు):

జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరంలో తనిఖీలు చేపట్టారు. నిందితుల వద్ద నుంచి రూ.66 లక్షలు విలువ చేసే 228 కిలోల గంజాయితో పాటు విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బిజెపి లో చేరేందుకు ఎంపి మిథున్ రెడ్డి యత్నాలు

## అధిష్టానంతో టచ్‌లో ఉన్న మిథున్ రెడ్డి

## బిజెపి అంగీకరిస్తే అవినాశ్ మినహా అంతా చేరిక

## ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

అమరావతి,జూన్21(ప్రజా మంటలు):

బీజేపీలో చేరేందుకు రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మీడియాకు చెప్పారు. ఇప్పటికే మిథున్ రెడ్డి బీజేపీ అగ్ర నాయకత్వంతో టచ్‌లోకి వెళ్లారని ప్రకటించారు. ఈ క్రమంలో వైసీపీ ఖాళీ కావడం ఖాయంగా కన్పిస్తోందని స్వయంగా మిథున్ రెడ్డి కూడా బీజేపీ నాయకత్వంతో మాట్లాడుతున్నారని తెలిపారు. బీజేపీ ఒప్పుకుంటే అవినాష్ రెడ్డి మినహా వైసీపీ ఎంపీలంతా పార్టీ మారడానికి రెడీగా ఉన్నారన్నారు. కానీ వైసీపీ ఎంపీలు అవసరం లేదని బీజేపీ పెద్దలు చెబుతున్నారని అయినప్పటికీ తాము చేరుతామని మిథున్ రెడ్డి ఇంకా లాబీయింగ్ నడుపుతున్నారని ఆదినారాయణ రెడ్డి చెబుతున్నారు. తనతో పాటు బీజేపీలో చేరాల్సిందిగా తన తండ్రి పెద్దిరెడ్డి మీద కూడా మిథున్ ఒత్తిడి తెస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ వెల్లడించారు. అసెంబ్లీ లాబీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సంచలన వ్యాఖ్యలు చేశారు. వైకాపా ఖాళీ అవడం ఖాయంగా కనిపిస్తోందన్నారు. భాజపా అంగీకరిస్తే అవినాష్‌రెడ్డి మినహా వైకాపా ఎంపీలంతా పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ, భాజపా నాయకత్వం వాళ్లు అక్కర్లేదని అంటోంది. అయినా.. మేం చేరతామంటూ మిథున్‌రెడ్డి ఇంకా లాబీయింగ్ చేస్తున్నారు. భాజపాలో చేరాలని ఆయన తండ్రి పెద్దిరెడ్డి మీద కూడా ఒత్తిడి తెస్తున్నారు. ఓదార్పు యాత్ర కోసం జగన్ మళ్లీ 14 కారణాలు వెతుక్కుంటు న్నారు. చెల్లి వల్లే నష్టపోయామని జగన్ తెలుసుకున్నాడు. చెల్లితో రాజీ చేయాలని తల్లిని కోరాడు. అన్ననే వచ్చి కాంగ్రెస్‌లో చేరాలని షర్మిల చెప్పేసింది. త్వరలోనే వివేకా హత్య కేసులో అవినాష్ రెడ్డి అరెస్టవుతారు. కడప ఉప ఎన్నికల్లో భూపేశ్‌రెడ్డి తెదేపా తరఫున పోటీ చేసి గెలుస్తారని ఆదినారాయణరెడ్డి తెలిపారు. గత ఐదేళ్ల కాలంలో వివిధ శాఖల్లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని సీఎం చంద్రబాబును కోరామన్నారు. మద్యం, ఇసుక మాఫియాల మీదే కాకుండా చాలా శాఖల్లో అవినీతి భారీ ఎత్తున జరిగిందని ఆరోపణలు చేశారు. విద్యుత్ రంగంలో స్మార్ట్ మీటర్లు, పీపీఏల్లో భారీ కుంభకోణాలు జరిగాయని.. జగన్ పై చర్యలు తీసుకోవాలని ఆదినారాయణ రెడ్డి కోరుతున్నారు. వైసీపీ గెలిచిది నాలుగు ఎంపీ స్థానాలు మాత్రమే. అందులో రాజంపేట , తిరుపతి , అరకు, కడప స్థానాలు ఉన్నాయి. రాజంపేట, తిరుపతి స్థానాలను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బలంతో గెలిపించుకున్నారు. పెద్దిరెడ్డి కుటుబం నుంచి పోటీ చేసిన ముగ్గురూ విజయం సాధించారు. కానీ పెద్దిరెడ్డి టీడీపీని టార్గెట్ చేస్తూ అనేక కార్యక్రమాలు చేపట్టారు. చంద్రబాబుపై రాళ్ల దాడి వెనకు ఆయన ఉన్నారని ఆరోపణలు ఉన్నాయి. అలాగే కుప్పంలో చంద్రబాబును, హిందూపురంలో బాలకృష్ణను ఓడించేందుకు పెద్ద ఎత్తున ఖర్చు పెట్టారు. ఆయనకు మైనింగ్, మిల్క్, కాంట్రాక్ట్‌లు వంటి బిజినెస్ లు ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం టా÷–గ్గ÷ట్ చేస్తే తాము ఇబ్బంది పడతామని అనుకుంటున్నారు. బీజేపీలో ఉంటే సేఫ్ గా ఉంటామన్న ఉద్దేశంతో ఆ పార్టీ వైపు చూస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఆదినారాయణ రెడ్డి వారం రోజుల కిందట కూడా ఇలాంటి ఆరోపణలే చేశారు. అయితే అప్పుడు ఎవరూ ఖండించలేదు. మిథన్ రెడ్డి కూడా ఖండించలేదు. దీంతో మరోసారి ఆదినారాయణరెడ్డి అవే వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ఘోరంగా ఓడిపోవడం.. గతంలో వైసీపీ పాలన అంతా కక్ష సాధింపుల మయం కావడంతో.. తమపైనా అలాగే ప్రవర్తిస్తే ఇబ్బందులు పడతామన్న ఉద్దేశంతో .. వైసీపీ నేతలు సేఫ్ జోన్ లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని భావిస్తున్నారు.

## సింగరేణిని కాపాడే ఉద్దేశ్యం కాంగ్రెస్‌కు లేదు

**మోడీతో కలసి రేవంత్ కుమ్మక్కయ్యారు - మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ ఆరోపణ**

హైదరాబాద్,జూన్21 (ప్రజా మంటలు):



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బీఆర్ఎస్ పార్టీపై అవగాహన లేని ఆరోపణలు చేస్తున్నారని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత మోదీ, రేవంత్ రెడ్డి కలిసి సింగరేణిని అమ్ముతారని కేసీఆర్ ముందే చెప్పారని గుర్తుచేశారు. సింగరేణిని కాపాడే ఉద్దేశం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి లేదని ఎద్దేవాచేశారు. తెలంగాణ భవన్?లో వినోద్?మీడియాతో మాట్లాడుతూ 'మైన్స్ అండ్ మినరల్స్ రెగ్యులేషన్ అమెండ్మెంట్ బిల్లుకు మద్దతిచ్చిందని అసత్య ప్రచారం చేస్తున్నరు. ఈ బిల్లును కాంగ్రెస్ పార్టీ 2013లో పార్లమెంటులో ప్రవేశపెట్టింది. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆరు నెలల్లో ఆర్డినెన్స్ రూపంలో చట్టం చేసింది. కాంగ్రెస్ పార్టీకి పరిపాలన అంటే జోక్ గా మారింది. సెక్షన్ 17ఏ కింద బొగ్గు గనులను సింగరేణికి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వానికి కేసీఆర్ లేఖ రాశారు. ఆ లేఖను కేంద్ర ప్రభుత్వం దగ్గరకు రేవంత్ రెడ్డి, భట్టి తీసుకెళ్లి బొగ్గు గనులను సింగరేణికి వచ్చే విధంగా కృషి చేయాలి' అని సూచించారు.

# 2కోట్లతో గద్దర్ మల్టీపర్పస్ హాల్

## శంకుస్థాపన చేసిన మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి,జూన్21 (ప్రజా మంటలు):

ప్రజాసంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న గద్దర్ మల్టీపర్పస్ ఆడిటోరియం నిర్మాణ పనులకు జూన్ 21న మంత్రివర్యులు శంకుస్థాపన చేశారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో రూ.8 కోట్ల 40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన మున్సిపల్ పరిపాలన భవనాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు, పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. తెల్లాపూర్ మునిసిపాలిటీలో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం 15 రోజుల్లో మొదలు పెడతామని మంత్రి హమీ ఇచ్చారు. చెరువులను, కుంటలను కాపాడుకోవాలని లేదంటే.. భవిష్యత్తు తరాలకు మనుగడ ఉండదని ఆయన హితవు పలికారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చేపట్టే ప్రతిపనిలో ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన జాతీయ జెండా స్తంభం, మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

## ఆర్థిక సంఘం నిధుల మళ్లింపుపై ఆగ్రహం

## అధికారులను ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసిన డిప్యూటి సిఎం

అమరావతి,జూన్21(ప్రజా మంటలు):

రాష్ట్ర వ్యాప్తంగా సీజనల్ వ్యాధుల కట్టడిపై అసెంబ్లీ కమిటీ హాల్‌లో సమీక్ష నిర్వహించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశ్నలతో అధికారులను ఉక్కిరిబిక్కిరి చేశారు. ఈ సమావేశానికి వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, పురపాలకశాఖ మంత్రి నారాయణ, సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్, పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్, ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు తదితరులు హాజరయ్యారు. 15వ ఆర్థిక సంఘం నిధుల మళ్లింపు వ్యవహారంపై అధికారులను పవన్ నిలదీశారు. స్థానిక సంస్థలకు నిధులు ఎందుకు ఇవ్వలేదంటూ అసహనం వ్యక్తం చేశారు. ఆ నిధులను సీఎఫ్ఎంఎస్ ఖాతాకు ఎంత మేర మళ్లించారో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. విజయవాడలో డయేరియా కేసులు ఉత్పన్నం కావడానికి తాగునీటి సరఫరాలో లోపాలే కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. మలేరియా సహా వివిధ రకాల అంటువ్యాధుల నివారణ, నీటి ద్వారా సంక్రమిత వ్యాధుల నియంత్రణ, సంసిద్ధతపై మంత్రులు, అధికారులతో చర్చించారు. అలాగే సీజనల్ వ్యాధుల వ్యాప్తి నిరోధంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమీక్ష నిర్వహించారు. తాగునీటి సరఫరాలో లోపాల వల్ల విజయవాడలో డయేరియా కేసులు ఉత్పన్నమవుతున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధుల కట్టడికి నియంత్రణ విధానాన్ని అమలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# ఎమ్మెల్యేల జంపింగ్‌తో బిఆర్ఎస్‌లో అలజడి

## భారీగా చేరికలకు స్కెచ్ వేసిన కాంగ్రెస్

## విపక్ష స్థానంలోకి రావాలని బిజెపి ఆరాటం

## పోచారంతో మొదలైన చేరికల పర్వం

## బిఆర్ఎస్ ప్రతిపక్ష హోదాకు ముప్పు

హైదరాబాద్,జూన్21 (ప్రజా మంటలు):

: భారత రాష్ట్ర సమితిలో అంతర్గతంగా అలజడి రేగుతోంది. ఊహించని విధంగా మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకోవడంతో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో బీఆర్ఎస్ పడిపోయింది. ఆయన ఇంటి మందు ధర్నా చేసేందుకు బాల్క సుమన్ నేతృత్వంలో కొంత మంది బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రయత్నించారు. కానీ ఈ సమావేశం జరుగుతున్న సమయంలోనే.. ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి … కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డిని కలిశారు. దీంతో.. పార్టీ నుంచి వలసలు చాలా పెద్ద స్థాయిలో ఉంటాయన్న అభిప్రాయం కలుగుతోంది. చేరికలను ప్రోత్సహించడం ద్వారా ఎమ్మెల్యేలను కాంగ్రెస్, బిజెపిలు పంచుకోవాలని చూస్తున్నాయని తెలుస్తోంది. బిఆర్ఎస్‌కు ప్రతిపక్ష పాత్ర లేకుండా చేస్తే..ఆ స్థానాన్ని బిజెపి ఆక్రమించుకోవాలని చూస్తోంది. దీంతో బిఆర్ఎస్ నుంచి చేరికలను ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు బిజెపిలోకి వెళ్లాలని అనుకుంటున్నట్లు సమాచారం. అసెంబ్లీ సమావేశాల లోగా బిఆర్ఎస్ ఖాళీ కావడం ఖాయమని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. పార్టీ ముఖ్య నేతలంతా ఇతర పార్టీల్లోకి క్యూ కడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక సీట్లలో డిపాజిట్లు కూడా కోల్పోవడంతో చాలా మంది నేతలు రాజకీయ భవిష్యత్ పై ఆందోళన చెందుతున్నారు. అదే సమయంలో కాంగ్రెస్, బీజేపీల నుంచి వారిపై ఒత్తిడి వస్తోంది. ప్రస్తుతం 35 మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో ఉన్నారు. వీరిలో కనీసం ఇరవై మందిని పార్టీలో చేర్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. మిగతా వారిపై బీజేపీ వల విసురుతోంది. పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిపై ఈడీ దాడులు రాజకీయమేనని అనుకుంటున్నారు. ఎమ్మెల్యేలను బుజ్జగించేందుకు బీఆర్ఎస్ హైకమాండ్ ప్రయత్నాలు చేస్తోంది. కొద్ది రోజుల కిందట నలుగురు ఎమ్మెల్యేలను కేసీఆర్ ఫామ్ హౌస్‌కు

పిలిపించుకుని మాట్లాడారు. కానీ వారెవరూ పార్టీలో ఉండే అవకాశాలు కనిపించడం లేదు. పార్టీ మారుతారని భావిస్తున్న మరికొంత మంది ఎమ్మెల్యేలతోనూ కేసీఆర్ మాట్లాడుతున్నారు. అయితే చాలా మంది స్పందించడం లేదు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి సహా చాలా మంది ఇప్పటికే కాంగ్రెస్ లో చేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నారని అంటున్నారు. పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టడానికి అసెంబ్లీ సమావేశం కాబోతోంది. అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరవ్వాలని అనుకుంటున్నారు. అంతకు ముందే ఆయనకు ప్రతిపక్ష నేత హోదా పోయేలా చేయాలని కాంగ్రెస్ వ్యూహాత్మకంగా ప్రయత్నిస్తోందని చెబుతున్నారు. . బీజేపీ కూడా ఎమ్మెల్యేలను ఆకర్షించి ప్రధాన ప్రతిపక్షంగా తామే వ్యవహరించాలని బీజేపీ అనుకుంటోందని అంటున్నారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమకలాకర్ ఇప్పటికే చర్చలు పూర్తి చేసినట్లుగా చెబుతున్నారు. ఎమ్మెల్యేలు కాకుండా ఇతర పార్టీ ముఖ్య నేతలు కూడా వలస బాటలో ఉండటం బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టేదే. ఈ సంక్షోభాన్ని కేసీఆర్ ఆపగలుగుతారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల వరకూ బలంగా ఉన్న బీఆర్ఎస్..ఆ ఎన్నికల్లో ఓడిపోవడంతో పరిస్థితి ఒక్క సారిగా తిరగబడింది. ఇతర రాష్టాల్లో పార్టీని బలోపేతం చేయడానికి ప్రణాళికలు వేసుకుంటే.. ఒక్క ఓటమితో సొంత రాష్ట్రంలో పార్టీ నేతల్ని కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్న ఆందోళన బీఆర్ఎస్ నేతల్లో వ్యక్తమవుతోంది. అయితే ఎన్ని చర్యలు తీసుకున్నా, ఎంతగా బుజ్జగించినా ఎమ్మెల్యేలు కూడా తోణ రాకయా ప్రయోజనాలకే మొగ్గ చూపే అవకాశం ఉంది.

# ప్రపంచ వ్యాప్తంగా యోగా డే ఉత్సవాలు



### శ్రీనగర్‌లో యోగాసనాలువేసిన ప్రధాని

### యోగాతో ఆరోగ్యాన్ని సాధించవచ్చని వెల్లడి

శ్రీనగర్,జూన్21 (ప్రజామంటలు): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా ఉత్సాహంగా జరుపుకున్నారు. పదో అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. శ్రీనగర్‌లోని డాల్ సరస్సు నద ఒడ్డున యోగా దినోత్సవానికి ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యారు. షేర్-ఏ-కశ్మీర్ సమావేశ కేంద్రం వద్ద ప్రధాని మోడీ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2015లో తొలిసారి యోగా గురించి ప్రస్తావించాక మార్పు మొదలైందని, యోగా నేర్పేందుకు వందల సంఖ్యలో సంస్థలు వెలిశాయని, యోగాతో శారీరకంగా, మానసికంగా మార్పులు వస్తాయని, యోగా నేర్పే మహిళలకు పద్మ శ్రీ అవార్డు కూడా దక్కిందని మోడీ ప్రశంసించారు. భారత దేశంలో అనేక వర్సిటీలు యోగా కోర్సులు ప్రారంభించాయని, యోగా, ధ్యానంతో ఏకాగ్రత పెరుగుతోందని, యోగా ఇవాళ కోట్ల మందికి దైనందిన కార్యక్రమంగా మారిందని కొనియాడారు. యోగా ప్రాముఖ్యతను అనేక దేశాల నేతలు తనని అడిగారని, యోగా ప్రాముఖ్యత రోజు రోజుకు పెరుగుతోందన్నారు. దాల్ సరస్సు ఒడ్డున మోదీ 7000 మందితో యోగా చేయవలసి ఉండగా వర్షం కారణంగా కార్యక్రమానికి అంతరాయం కలిగింది. కార్యక్రమాన్ని ఇండోర్ స్టేడియంకు మార్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రధాని మోదీ 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని కోరారు. యోగాను ప్రపంచ మంచికి శక్తివంతమైన ఏజెంట్‌గా చూస్తోందని మోదీ తెలిపారు. యోగా మనకు జీవించడంలో సహాయపడుతుందని అన్నారు. ఇది మనలోని లోతైన భావాలతో కలుపుతుందని, మన చుట్టూ ఉన్నవారి సంక్షేమాన్ని గ్రహించడంలో యోగా సహాయపడుతుంద న్నారు. నేటి ప్రపంచంలో యోగా అనేది ఒక విజ్ఞాన శాస్త్రమని, మనిషి మనసుపై దృష్టి పెట్టడమే దీనికి పరిష్కార మర్గామని మోదీ పేర్కొన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద సంస్థలు,విశ్వవిద్యాలయాలు యోగాపై పరిశోధనలను ప్రచురిస్తున్నాయి. యోగా ఇప్పుడు పరిమితం కాదు. ప్రపంచం కొత్త యోగా ఆర్థిక వ్యవస్థను చూస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులు యోగాను నేర్చుకోవడానికి భారతదేశానికి వస్తున్నారని మోదీ వెల్లడించారు. ఇది యోగా టూరిజాన్ని పెంచుతోందని మోదీ తెలిపారు. ప్రస్తుతం 100కి పైగా సంస్థలు ఆయుష్ మంత్రిత్వ శాఖ యోగా బోర్డు ద్వారా ధృవీకరించ బడినందుకు సంతోషిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో క్రమంగా యోగా చేసే వారి సంఖ్య పెరుగు తోందన్నారు. యోగ ద్వారా మనం పొందుతున్న శక్తిని అనుభూతి చెందగలమని ప్రధాని అభిప్రాయం వ్యక్తం చేశారు. యోగా దినోత్సవం సందర్భంగా దేశంలోని ప్రజలకు, ప్రపంచంలోని ప్రతి మూలలో యోగా చేస్తున్న వారికి ప్రధాని శుభాకాంక్షలు తెలియజేశారు. పదేళ్లుగా ప్రపంచ వ్యాప్తంగా యోగా దినోత్సవం ఘనంగా జరుపుకుంటున్నామని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. విదేశాల్లో యోగా చేసే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోందని, జర్మనీలో ఇవాళ కోటిన్నర మంది నిత్యం యోగా చేస్తున్నారని, ప్రపంచ యోగా గురువుగా భారత్ మారిందన్నారు. అంతర్జాతీయ యోగా గురించి 2014లో ఐరాసలో ప్రస్తావించినప్పుడు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని 177 దేశాలు సమర్థించాయని గుర్తుచేశారు. అప్పటినుంచి యోగా దినోత్సవం రికార్డు సృష్టిస్తుందని అన్నారు.ఇకపోతే భారత సరిహద్దుల్లో మంచుతో ఉన్న ఎత్తైన శిఖరాల మధ్య ఆర్మీ సైనికులు యోగా డే సందర్భంగా యోగా సాధన చేశారు. అంతేకాదు మంచు మధ్య యోగా చేస్తూ సూర్య నమస్కారాలతో ఫిట్‌గా ఉండాలనే సందేశాన్ని ప్రజలకు అందించారు. దీంతోపాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో యోగా



శిబిరాలు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని యోగా మెళకువలు నేర్చుకున్నారు.రోవైపు తూర్పు లడఖ్‌లో కూడా ఆర్మీ సైనికులు యోగా ఆసనాలు వేశారు. 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగా చేస్తూ కనిపించారు. ఈ దృశ్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో షేర్ చేయగా ప్రస్తుతం అవి వైరల్ అవుతున్నాయి. భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. దేశంలోని అనేక చారిత్రక కేంద్రాల్లో మంత్రులు, పిల్లలు, మహిళలు సహా అనేక మంది పాల్గొని యోగా చేస్తున్నారు. యోగా ద్వారా శారీరక అవయవాలతో పాటు మనస్సు, మెదడు, ఆత్మకు సమతుల్యత చేకూరుతుందని యోగా నిపుణులు చెబుతున్నారు. క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వల్ల శారీరక, మానసిక సమస్యల నుంచి కూడా ఉపశమనం పొందవచ్చని వెల్లడించారు. యోగాతో క్రమశిక్షణ, ఏకాగ్రత లభిస్తాయని నిపుణులు వివరించారు. మంచి ఆరోగ్యానికి... యోగా బాటలు వేస్తుందని అన్నారు. యోగాతో శాంతివస్తుందని మహర్షులు, ఆచార్యులు చెప్పారన్నారు. యోగాతో ప్రపంచానికి శాంతి లభిస్తుందన్నారు. యోగా మనల్ని బలవంతులుగా చేస్తుందన్నారు. ఆరోగ్యం, శాంతి, సంతోషానికి సూచిక యోగా అని అన్నారు. కొన్నేళ్ల క్రితం అయితే ఆధ్యాత్మిక కేంద్రాల్లోనే యోగా కనిపించేదని, కానీ ప్రస్తుతం ప్రపంచం నలుమూలలా విస్తరించిందన్నారు.



# తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్

### ప్రత్యేక రాష్ట్రం కోసం తపించిన మహోన్నతుడు - వర్ధంతి సందర్భంగా పలువురు నివాళి

వరంగల్,జూన్ 21 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలని ఉందని తరుచుగా చెప్పిన జయశంకర్ ఆ కల నేరవేరకుండానే 2011, జూన్ 21న ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందే మరణించారు. ఆయన వర్ధంతి సందర్భంగా ఆచార్యకు పలువురు నివాళి అర్పించారు. ఆయన త్యాగనిరతిని కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా మిగిలి పోయారు. తెలంగాణ సిద్ధాంతకర్తగా పేరుపొందిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆగష్టు 6, 1934న వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం అక్కంపేటలో జన్మించారు. ఆర్థికశాస్త్రంలో పీహెచ్‌డి పట్టా పొంది, ప్రిన్సిపాల్‌గా, రిజిస్ట్రార్‌గా పనిచేసి కాకతీయ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ వరకు ఉన్నత పదవులు పొందారు. తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో మంచి ప్రావీణ్యం ఉన్న జయశంకర్ తెలంగాణ ఉద్యమానికే తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారు. 1969 తెలంగాణ ఉద్యమం లోనూ, అంతకు ముందు నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్- ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఏర్పాటులో కె.చంద్రశేఖరరావుకు సలహాదారుగా, మార్గదర్శిగా వెన్నంటి నిలిచారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై పలు పుస్తకాలు రచించారు. బెనారస్, అలీగఢ్ విశ్వవిద్యాలయాలనుంచి ఆర్థికశాస్త్రంలో పట్టా అందుకున్న జయశంకర్ ఓయూలో పీహెచ్‌డీ చేశారు. 1975 నుంచి 1979 వరకు వరంగల్ సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశాడు. 1979 నుంచి 1981 వరకు కేయూ రిజిస్ట్రార్‌గా, 1982 నుంచి 1991 వరకు సీఫెల్ రిజిస్ట్రార్‌గా, 1991 నుంచి 1994 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి గా పనిచేశారు. 1969 తెలంగాణా ఉద్యమంలో జయశంకర్ చురుగ్గా పాల్గొన్నారు.



అంతకుముందు 1952లో నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్-ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో కూడా పాల్గొన్నారు. 1954లో తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థి నాయకుడిగా ఆయన ఫజల్ అలీ కమిషన్‌కు నివేదిక ఇచ్చారు. 2001 నుంచి కె.చంద్రశేఖరరావుకు సలహాదారుగా, మార్గదర్శిగా తోడ్పాటు అందించారు. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతపై ఆయన పలు పుస్తకాలు రాశారు. తెలంగాణలోనే కాకుండా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో, విదేశాల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత గురించి ప్రసంగాలు చేశారు. జయశంకర్ తన ఆస్తిని, జీవితాన్ని తెలంగాణ కోసం అంకితం చేశారు. ఇప్పుడైతే నాకు ఒకే కోరిక మిగిలింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళ్ళారా చూడాలి, తర్వాత మరణించాలని అనేవారు. :తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి పేరుమార్చి ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంగా పేరుపెట్టారు. అలాగే 2016 అక్టోబరు 11న తెలంగాణలో కొత్తగా ఏర్పాటుచేసిన 21 జిల్లాలలో ఒక జిల్లాకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాగా నామకరణం చేసారు.

# డిప్యూటి సిఎం పవన్ ఓఎస్డీగా కృష్ణతేజ

### అంగీకరించిన సిఎం చంద్రబాబు

### డిప్యుటేషన్ కోసం కేంద్రానికి లేఖ




అమరావతి, జూన్ 21 (ప్రజా మంటలు): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఓఎస్‌డీగా కేరళలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువ ఐఏఎస్ అధికారి మైలవరపు వీఆర్ కృష్ణతేజ నియామకం దాదాపుగా ఖరారు అయినట్లే అంటున్నారు. సాధారణంగా ఆర్‌డీఓ స్థాయి అధికారులను మంత్రులకు ఓఎస్‌డీలుగా నియమిస్తారు. అయితే పవన్‌కల్యాణ్ కోసం.. ఐఏఎస్ అధికారి అయిన కృష్ణతేజ నియామకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం కేరళలోని త్రిసూర్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి పంపాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. కృష్ణతేజ గతంలో కేరళ పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ, పర్యాటకశాఖ డైరెక్టర్, ఎస్సీ అభివృద్ధిశాఖ డైరెక్టర్, అలప్పుజ జిల్లా కలెక్టర్‌గా సేవలందించారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన కృష్ణతేజ రెండు రోజుల కిందట సచి వాలయంలో పవన్‌కల్యాణ్‌ను కలిశారు. త్రిసూర్ జిల్లా కలెక్టర్‌గా కృష్ణతేజ అం దించిన సేవలకు గాను జాతీయ బాలల రక్షణ కమిషన్ ఆయనను పురస్కారానికి ఎంపిక చేసింది. బాలల హక్కుల రక్షణలో త్రిసూర్ జిల్లాను ఆయన దేశంలోనే అగ్రగామిగా నిలిపారు. 2015 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన.. 2023 మార్చి లో కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. కరోనా కారణంగా తల్లి దండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన 609 మంది విద్యార్థు లను గుర్తించి.. దాతల సహకారంతో ఉన్నత చదువులకు చేయూ త అందించారు. కరోనా సమయంలో భర్తలను పోగొట్టుకున్న 35 మంది వితంతువులకు ఇళ్లు నిర్మించడంతో పాటు 150మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. ఐఏఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆయన అద్భుత పనితీరుతో తనదైన ముద్ర వేస్తున్నారు.

# చొప్పదండి ఎమ్మెల్యే సత్యం భార్య ఆత్మహత్య

### - భర్తకు ఫోన్ చేసిన మరుక్షణం ఉరేసుకుని బలవన్మరణం

### - కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



కరీంనగర్/హైదరాబాద్, జూన్21 (ప్రజా మంటలు): కరీంనగర్ జిల్లా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూపాదేవి ఆత్మహత్య చేసుకున్నారు. హైదరాబాద్ అల్వాల్ పంచశీల కాలనీలోని ఇంట్లో గురువారం రాత్రి ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. గత 12 సంవత్సరాల క్రితం రూపదేవిని ప్రేమించి వివాహం చేసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం.. భార్య రూపాదేవి మధ్య మనస్పర్థలు ఉన్నట్లు అనుమానం వ్యక్తమవుతుంది. రూపాదేవి మేడ్చల్ మునిరాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.గత సంవత్సర కాలంగా కొంపల్లిలో పేట్ బషీరాబాద్ లోని దవేరియా విల్లాస్ లోని నివాసం ఉండేవారు. అయితే గత నెల రోజుల క్రితమే హైదరాబాద్, అల్వాల్ లోని పంచశీల కాలనీ రోడ్ నెంబర్ 12కి షిఫ్ట్ అయ్యారు. ఎమ్మెల్యే సత్యం- రూపదేవికి ఇద్దరు పిల్లలు. కుమారుడు యోజిత్ (11 ) , కుమార్తె రిషిక శ్రీ (9). గత కొంతకాలంగా ఎమ్మెల్యే దంపతుల మధ్య విభేదాలు ఉన్నట్లు సమాచారం. రూపాదేవి తాను చనిపోతున్నట్లు వీడియో కాల్ చేసి ఎమ్మెల్యే సత్యంకు చెప్పగా.. ఆయన వెంటనే చొప్పదండి నుంచి కారులో హైదరాబాద్ కు బయలుదేరారు. అయితే ఆల్వాల్ చేరుకునేలోగానే రూపాదేవి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఇంటి సమీపంలో ఉన్న లేనివో ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె చనిపోయారని వైద్యులు తెలిపారు. భార్య మృతిని తట్టుకోలేక ఎమ్మెల్యే సత్యం హాస్పటల్లో స్పృహ తప్పి పడిపోయారు. కొంపెల్లిలోని ఓ ప్రవేట్ ఆస్పత్రిలో ఉన్న ఎమ్మెల్యేని మేడిపల్లి సత్యాన్ని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి మృతదేహాన్ని ఉదయం తరలించారు. ఆమె బలవన్మరణానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

# పోచారం కాంగ్రెస్‌లో చేరికతో బిఆర్ఎస్ ఆగ్రహం

### ఇంటిముందు ఆందోళనకు దిగిన బాల్క సుమన్ - అరెస్ట్ చేసిన పోలీసులు



హైదరాబాద్,జూన్ 21 (ప్రజామంటలు): పోచారం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరిన క్రమంలో మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్, ఇతర భారాస నేతలు పోచారం శ్రీనివాసరెడ్డి నివాసానికి చేరుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అక్కడ ఉన్న సమయంలోనే నిరసనకు దిగారు. ఈక్రమంలో భారాస, కాంగ్రెస్ నేతల మధ్య తోపులాట, ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో బాల్క సుమన్, భారాస నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ ఇంటి దగ్గర బాల్క సుమన్ నేతృత్వంలో ఆందోళన నిర్వహించారు. ఆ క్రమంలో పోచారం ఇంట్లోకి బీఆర్ఎస్ నేతలు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బాల్క సుమన్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆ క్రమంలో పోలీసులు బీఆర్ఎస్ నేతలను అడ్డుకోగా ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. ఎంత సేపటికీ వినకపోవడంతో బాల్క సుమన్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు.అయితే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని సమాచారం తెలుసుకుని ఆయన ఇంటి వద్దకు చేరుకుని బాల్క సుమన్ నేతృత్వంలో ఆందోళన చేపట్టారు. అప్పటికే పోచారం సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి చేరుకుని కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. అయితే ఈసారి ప్రకటించనున్న మంత్రి వర్గంలో పోచారానికి మంత్రి పదవి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com